E KABURU - Digital News Paper

E-PAPER

# ఈ-కబురు

@ekaburu.com

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

హైదరాబాద్ (తేదీ) 21-02-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:51 పేజీలు–6 www.ekaburu.com



రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా?
.. కోతలు జరిగేటప్పుడు ఇస్తారా? » 2లో

## దేవాదుల ప్రాజెక్టుపై
# నిర్లక్ష్యం ఎందుకు?



- కాంగ్రెస్ పాలనలో నత్తనడకనే దేవాదుల పనులు
- టిఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మోటర్లు, లిఫ్ట్ లు బంద్ చేశారు
- దేవాదుల పరిధి రైతులకు అన్యాయం; హరీష్ రావు

**ఈ కబురు, హనుమకొండ :**

దేవాదుల ప్రాజెక్టు పనులు అంగుళం కూడా ముందుకు నడవట్లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. హనుమకొండ జిల్లా దేవన్నపేట పంప్‌హౌస్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. వరంగల్ జిల్లాలో దేవాదుల పరిధి రైతులకు అన్యాయం జరుగుతోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పాలనలో దేవాదుల పనులు నత్తనడకన నడిచాయని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాదుల నీటి కేటాయింపులను 60 టీఎంసీలకు పెంచినట్లు చెప్పారు. ''దేవాదుల ఆయకట్టును 47 వేల ఎకరాల నుంచి 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన మోటార్లను ఈ ప్రభుత్వం నడపలేకపోతోంది. నిర్వహణ ఖర్చులు రూ.8 కోట్లు లేక మోటార్లు నడపట్లేదు. గండిరామారంతోపాటు ఇతర లిఫ్ట్‌లు బంద్ చేశారు. దేవన్నపేట పంప్‌హౌస్‌లో 3 మోటార్లు నడవట్లేదు. మరమ్మతులకు గుర్రైనట్లు అధికారులు చెబుతున్నారు తరువాయి 2లో




# 'ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం
# ఏఐ సదస్సులో రేవంత్ రెడ్డి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలన్న ముఖ్యమంత్రి
- ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్ష
- జీఎస్టీ కౌన్సిల్‌లా ఏఐ కౌన్సిల్ ఏర్పాటు చేయాలన్న రేవంత్ రెడ్డి

**ఈ కబురు, ఢిల్లీ**

“ మన దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రత్యేక వార్ రూమ్‌ను ఏర్పాటు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఏఐ పరిణామాలను పర్యవేక్షించడానికి, ఇతర అవసరాల కోసం వార్ రూమ్ అవసరమని, ఇలాంటి వార్ రూమ్ కోసం హైదరాబాద్ ఎంతో అనువైన ప్రదేశమని ఆయన అన్నారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సదస్సు-2026 సదస్సులో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ, మనిషి కంటే కృత్రిమ మేధ (ఏఐ) ఎక్కువ తెలివితేటలు కలిగి ఉందని అన్నారు. ఏఐలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో ఏఐ వర్సిటీని ఇప్పటికే అన్ని వసతులతో ఏర్పాటు చేశామని వెల్లడించారు. హైదరాబాద్ వంటి నగరంలో ప్రతి ఆరు నెలలకోసారి ఏఐకి సంబంధించిన సదస్సులు జరగాలని అన్నారు. జీఎస్టీ కౌన్సిల్ తరహా 'ఏఐ' కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. ఏఐ దుర్వినియోగం కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. హైదరాబాద్‌కు వచ్చి పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి టెక్ సంస్థలను కోరారు. తరువాయి 2లో



2

## ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది

- సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు
- గత ప్రభుత్వంలో మహిళలు బయటకు రావడానికి భయపడేవాళ్లు
- కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యత ఇస్తుంది
- తప్పు చేసిన వారికి శిక్ష తప్పదు.గీత దాటితే కటకటాలే...హోం మంత్రి అనిత

ఈ కబురు ; ఏపీలో వైసీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి నాయకత్వంలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గిందని



2

## గురుకులాలకు మహర్దశ

రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతపై తెలంగాణ ప్రభుత్వం కట్టుదిట్టమైన పర్యవేక్షణకు ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించేందుకు నోడల్ అధికారుల నియామకం, డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్ తయారీ, ఆకస్మిక సందర్శనలు తప్పనిసరి చేస్తూ జిల్లా అధికారులకు లిఖితపూర్వక సూచనలు పంపింది.



2

## అమీర్‌పేటలో అగ్నిప్రమాదం
### .. కోచింగ్ సెంటర్‌లో చిక్కుకున్న విద్యార్థులు

ఈ కబురు, హైదరాబాద్ : నగరంలో వరుస అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నాంపల్లి ఘటన మరవకముందే అమీర్‌పేట మైత్రీవనంలోని ఆదిత్య ఎన్‌క్లేవ్ బిల్డింగ్‌లోని కోచింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది.

## నాంపల్లి సిబిఐ కోర్టుకు
# బాంబు బెదిరింపు



- ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు
- రెండు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు బాంబు బెదిరింపులు
- బాంబు పేలబోతోందని బెదిరించిన దుండగులు
- బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించిన పోలీసులు

**ఈ కబురు, హైదరాబాద్;**

హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా కోర్టు సిబ్బందికి ఈరోజు బెదిరింపులు పంపారు. కోర్టు ప్రాంగణంలో బాంబు అమర్చామని, దానికి టైం కూడా సెట్ చేశామని, బాంబు పేలబోతోందని ఈమెయిల్ ద్వారా బెదిరించారు. వెంటనే కోర్టు సిబ్బంది పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా నిమిషాల వ్యవధిలోనే వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపించారు. .... 2లో

## 'సర్' విధుల్లో జ్యుడిషియల్ అధికారులు..
# సుప్రీం అసాధారణ నిర్ణయం



**ఈ కబురు :**

పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియపై రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం మధ్య నిందల పర్వం కొనసాగుతోందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది దురదృష్టకర పరిణామమని అభిప్రాయపడింది. ఈ సందర్భంగా అసాధారణ నిర్ణయం తీసుకున్న సర్వోన్నత న్యాయస్థానం .. ఈ ప్రక్రియలో సాయం చేసేందుకు జ్యుడిషియల్ అధికారులను నియమించాలని హైకోర్టుకు ఆదేశించింది. ఎస్ఐఆర్ దరఖాస్తులపై వచ్చే అభ్యంతరాలను ఈ అధికారులు పరిశీలిస్తారని స్పష్టం చేసింది. తరువాయి 3లో

## కర్రెగుట్టలో పేలిన మందుపాతర



ఈ కబురు, ములుగు: మావోయిస్టుల వేరివేతలో భాగంగా కగార్ ఆపరేషన్-2 చేపట్టిన సీఆర్పీఎఫ్‌కు భారీ ప్రమాదం తప్పింది. కర్రెగుట్టలో కగార్-2 ఆపరేషన్‌లో భాగంగా మందుపాతర పేలింది. .... 2లో

## సమాంతర ప్రగతి
# సాధ్యమయ్యేనా?

- కార్పొరేషన్ల ఆదాయంలో భారీ తేడా
- శేరిలింగంపల్లి రాబడి రూ.306 కోట్లు
- చార్మినార్‌లో రూ.53 కోట్లు
- ఒక్కో జోన్‌కు.. ఒక్కో తీరున వ్యత్యాసాలు
- ఎక్కడి రాబడితో అక్కడే పనులు
- అధికారులకు సవాల్‌గా సమాంతర ప్రగతి



ఈ కబురు, హైదరాబాద్ : క్యూర్ (కోర్ అర్బన్ రీజియన్) పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్ వరకు ప్రజలందరికీ సమాన అభివృద్ధి, సమాన సదుపాయాల కోసమే ఉమ్మడి జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించినట్లు ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ, అది సాధ్యమేనా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. .... 2లో

## 33 మంది బాలలపై లైంగిక దాడి
### యూపీలో ఇంజినీర్ దంపతులకు
# మరణశిక్ష




- యూపీలోని బాందా పోక్సో కోర్టు దీనిని 'అత్యంత అరుదైన కేసు'గా అభివర్ణన
- 2010-2020 మధ్య వీడియో గేమ్స్ ఆశ చూపి నిందితుల ఘాతుకం
- బాధితులకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం
- సీబీఐ దర్యాప్తులో వెలుగులోకి వచ్చిన దారుణమైన నిజాలు

**ఈ కబురు ;**

సమాజంలో అత్యంత కిరాతకమైన, హేయమైన నేరానికి పాల్పడిన ప్రభుత్వ అధికారికి, ఆయన భార్యకు కోర్టు మరణశిక్ష విధించింది .... 2లో

# గ్రహాంతర వాసుల సమాచారం
# బహిర్గతం చేస్తా: ట్రంప్






ఈ కబురు : అమెరికా ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర వాసుల సమాచారాన్ని బహిర్గతం చేస్తామని ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఏలియన్ల సమాచారం ఉన్న ప్రభుత్వ ఫైళ్లను గుర్తించి, విడుదల చేయాలని ఈ మేరకు ఫెడరల్ ఏజెన్సీలకు మార్గదర్శకాలు జారీ చేశారు. .... 2లో

# 5 నిమిషాలు చాలు..

- మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారన్న రాజాసింగ్
- ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని సవాల్
- ఒవైసీ సోదరులపై రాజాసింగ్ ఆగ్రహం
- 15 ఏళ్ల సమయమిచ్చినా మీరేం చేయలేరు; రాజాసింగ్



ఈ కబురు ; మజ్లిస్ పార్టీ, ఒవైసీ సోదరులపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు 15 నిమిషాలు అడిగారు, కానీ నాకు ఐదు నిమిషాల సమయం ఇచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఓ కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్ మాట్లాడుతూ, తమకు 15 నిమిషాల సమయం ఇస్తే హిందువులు లేకుండా చేస్తానని అన్నారని మండిపడ్డారు. .... 2లో

ఈ-కబురు

21- 02 -2026
శనివారం

e kaburu.com

# గ్రహాంతర వాసుల సమాచారం బహిర్గతం చేస్తా: ట్రంప్



అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో గ్రహాంతర వాసుల సమాచారం గురించి మాట్లాడిన నేపథ్యంలో ట్రంప్ సమాఖ్య సంస్థలకు తాజాగా ఈ మార్గదర్శకాలు జారీ చేశారు. దశాబ్దాలుగా అనేకమంది అమెరికన్లు తమ ప్రభుత్వం వద్ద ఉన్న గ్రహాంతర జీవుల సమాచారాన్ని తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారని ట్రంప్ అన్నారు. అందుకే వాటికి సంబంధించిన ముఖ్యమైన.. ఆసక్తికరమైన సమాచారాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల ఓ పాడ్‌కాస్ట్‌లో ఒబామా గ్రహాంతర వాసుల ఉనికి గురించి మాట్లాడుతూ ఓ రహస్య విషయాన్ని వెల్లడించారని ట్రంప్ మండిపడ్డారు. ఆయన అలా చేసి ఉండకూడదన్నారు. అయితే ఒబామా చెప్పిన రహస్యం ఏంటనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.

--ఒబామా ఏమన్నారంటే..?
గతవారం ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన ఒబామా (Obama) ఏదోఒక గ్రహంపై గ్రహాంతర వాసులు ఉండే విషయాన్ని తాను బలంగా నమ్ముతున్నానని అన్నారు. కానీ.. ఏలియన్స్‌ను అమెరికాలోని నెవాడలో ఉన్న అత్యంత రహస్య ప్రాంతం 'ఏరియా 51' (Area 51)లో యూఎస్ ప్రభుత్వం నిర్బంధించిందనే ఊహాగానాల్లో నిజం లేదని పేర్కొన్నారు. గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన పలు రికార్డులు అమెరికా ప్రభుత్వం దగ్గర ఉన్నట్లు తాను అధ్యక్షుడిగా ఉన్న సమయంలో కూడా సమాచారం లేదన్నారు. తనకు తెలిసినంతవరకు ఏరియా 51లో ఎటువంటి భూగర్భ కేంద్రాలు లేవని.. ఒకవేళ ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియవని అన్నారు.

## 'ఏఐ' ప్రత్యేక వార్ రూమ్ అవసరం ..ఏఐ సదస్సులో రేవంత్ రెడ్డి



ఏఐ రంగంలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఏఐలో స్టార్టప్‌లను ప్రోత్సహించాలని అన్నారు. కృత్రిమ మేధను ఉపయోగించుకుంటే వ్యవసాయం సహా అన్ని రంగాలకు దోహదపడుతుందని పేర్కొన్నారు. ఏఐ మానవ జీవితాల్లో పెను మార్పులు తీసుకువస్తోందని ముఖ్యమంత్రి తెలిపారు. మనిషికి ఎన్నో పరిమితులు ఉండవచ్చని, అదే మనిషి సృష్టించిన ఏఐ ఫలితాలను మనం చూస్తూనే ఉన్నామని అన్నారు. గతంలో పారిశ్రామిక విప్లవం వచ్చిందని, ఇప్పుడు సాఫ్ట్‌వేర్ విప్లవం, ఏఐ శకం వచ్చిందని పేర్కొన్నారు. ప్రముఖ అంతర్జాతీయ కంపెనీలకు భారతీయులే సీఈవోలుగా ఉన్నారని గుర్తు చేశారు.

# 33 మంది బాలలపై లైంగిక దాడి ... యూపీలో ఇంజినీర్ దంపతులకు మరణశిక్ష

దాదాపు 33 మంది చిన్నారులపై (అందరూ అబ్బాయిలే) దశాబ్ద కాలంగా లైంగిక దాడులకు పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని బాందా ప్రత్యేక పోక్సో కోర్టు ఈ సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసును "అరుదైన వాటిలో అత్యంత అరుదైనది"గా అభివర్ణించిన న్యాయస్థానం, నిందితులకు కఠిన శిక్ష విధించడం ద్వారానే న్యాయం జరుగుతుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, యూపీ నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాంభవన్, ఆయన భార్య దుర్గావతి సుమారు 2010 నుంచి 2020 వరకు బాందా, చిత్రకూట్ జిల్లాల్లో ఈ ఘాతుకాలకు పాల్పడ్డారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, డబ్బు, బహుమతులు ఆశ చూపి చిన్నారులను లొంగదీసుకుని వారిపై లైంగిక దాడి చేసేవారు. ఈ క్రమంలో వారితో అశ్లీల వీడియోలు చిత్రీకరించి, వాటిని ఇంటర్నెట్‌లో ప్రసారం చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. బాధితుల్లో మూడేళ్ల పసిపిల్లలు కూడా ఉండటం ఈ నేర తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు విచారణ చేపట్టిన సీబీఐ, 2020 అక్టోబర్ 31న కేసు నమోదు చేసి, 2021 ఫిబ్రవరి 10న రాంభవన్ దంపతులపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఐపీసీ, పోక్సో చట్టంలోని పలు కఠిన సెక్షన్ల కింద వీరిని దోషులుగా నిర్ధారిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చింది. నిందితుల నైతిక పతనం, నేరాల తీవ్రత దృష్ట్యా వారికి పశ్చాత్తాపపడే అవకాశం కూడా ఇవ్వరాదని, అత్యున్నత శిక్ష మాత్రమే సరైనదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. నిందితుల లైంగిక దాడిలో తీవ్రంగా గాయపడిన కొందరు చిన్నారులు ఆసుపత్రిలో చికిత్స పొందగా, మరికొందరికి మెల్లకన్ను వంటి సమస్యలు తలెత్తాయి. చాలామంది ఇప్పటికీ మానసిక వేదన అనుభవిస్తున్నారని సీబీఐ తెలిపింది. ఈ కేసులో బాధితులందరికీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తలా రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది. నిందితుల ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును కూడా బాధితులకు సమానంగా పంచాలని సూచించింది. దర్యాప్తు సమయంలో బాధితులైన చిన్నారుల పట్ల సీబీఐ అధికారులు అత్యంత సున్నితంగా వ్యవహరించారని, వారికి కౌన్సిలింగ్ ఇప్పించి వారి మానసిక స్థైర్యాన్ని కాపాడారని సీబీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.



ఫోరెన్సిక్ నిపుణులు, వైద్య నిపుణులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ ఆధారాలను పకడ్బందీగా సేకరించినట్లు తెలిపింది.

## దేవాదుల ప్రాజెక్టుపై అంత నిర్లక్ష్యం ఎందుకు?



బీఆర్ఎస్ హయాంలో రూ.7,300 కోట్ల మేర దేవాదుల ప్రాజెక్టుపై ఖర్చు పెట్టాం. 80శాతానికిపైగా పనులు పూర్తి చేశాం. 47వేల ఎకరాల ఆయకట్టును.. 3.17 లక్షల ఎకరాలకు పెంచాం. ఈ ప్రాజెక్టు కోసం 33 వేల ఎకరాలు అవసరం ఉంటే.. 30వేల ఎకరాల భూ సేకరణ బీఆర్ఎస్ హయాంలోనే పూర్తయింది. ఒకట్రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి..మిగతా 3 వేల ఎకరాల భూ సేకరణ చేస్తే.. అదనంగా 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు పెరుగుతుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో ఈ ప్రాజెక్టు కోసం కనీసం రూ.200 కోట్లు అయినా ఖర్చు చేశారా? దేవాదుల ప్రాజెక్టుపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారు?'' అని హరీశ్‌రావు నిలదీశారు.

## నాంపల్లి సిబిఐ కోర్టుకు బాంబు బెదిరింపు



బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఈనెల 18వ తేదీ కూడా నాంపల్లి కోర్టుకు బంబు బెదిరింపులు వచ్చాయి. అదే రోజున కరీంనగర్, అనంతపురం, రాజమండ్రి కోర్టులకు కూడా బెదిరింపులు రావడం గమనార్హం. అయితే, ఆయా కోర్టుల్లో నిర్వహించిన తనిఖీల్లో బాంబుల ఆచూకీ లభించలేదు. ఇవన్నీ నకిలీ బెదిరింపులుగా పోలీసులు నిర్ధారించారు.

## సమాంతర ప్రగతి సాధ్యమయ్యేనా?



మూడు కార్పొరేషన్ల ఆదాయం, చేయాల్సిన పనుల్లో ఎంతో వ్యత్యాసం ఉండటమే ఇందుకు కారణం. ఉమ్మడి జీహెచ్ఎంసీలోనూ కొన్ని జోన్లలో ఎక్కువ, కొన్ని చోట్ల తక్కువ ఆదాయం ఉంది. కానీ, ఎక్కువ పరిధి ఉన్నందున.. ఆదాయం లేని ప్రాంతాల్లో సైతం మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం మూడు కార్పొరేషన్లుగా ఏర్పాటైనందున ఎక్కడి ఆదాయాన్ని అక్కడే వినియోగించాల్సి ఉంటుంది.

**--జీహెచ్ఎంసీలో..**
జీహెచ్ఎంసీకి అత్యధిక ఆదాయ వనరు ఆస్తిపన్ను. చార్మినార్ జోన్‌లో ఈ ఆర్థిక సంవత్సర ఆస్తిపన్ను డిమాండ్ రూ.534 కోట్లు కాగా, గత నెలాఖరు వరకు వసూలైంది కేవలం రూ. 53 కోట్లు మాత్రమే. అదే తరుణంలో శేరిలింగంపల్లి జోన్ డిమాండ్ రూ.675 కోట్లు కాగా, వసూలైంది రూ.306 కోట్లు. ప్రస్తుతం చార్మినార్ జోన్ జీహెచ్ఎంసీలో ఉండగా, శేరిలింగంపల్లి ఎంఎంసీలో ఉండటం తెలిసిందే. గతంలో ఉమ్మడి జీహెచ్ఎంసీలో చార్మినార్ జోన్‌లో సైతం ఇదేతీరున ఆదాయం ఉన్నా, మిగతా జోన్ల మాదిరిగానే పనులు చేసేవారు.వచ్చిన ఆదాయాన్నే అన్ని జోన్లకూ వినియోగించేవారు. ప్రస్తుతం చార్మినార్ జోన్‌లో పనులు చేయాలన్నా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆదాయాన్నే పంచినా జీహెచ్ఎంసీలో ఎక్కువ ఆస్తి పన్ను వసూలయ్యేది ఖైరతాబాద్ జోన్‌లో మాత్రమే. మిగతా జోన్లలో అంతంతమాత్రమే. ఆ జోన్ల అవసరాలకే అవి సరిపోవు. ఖైరతాబాద్ జోన్‌లో ఆస్తిపన్ను ద్వారా రూ.330 కోట్లు రాగా, మిగతా జోన్లలో రూ. 100 కోట్ల లోపునే ఉంది. డిమాండ్ దృష్ట్యా చూస్తే ఖైరతాబాద్ జోన్‌లోనూ వసూలు అంతంతమాత్రమే అని చెప్పక తప్పదు. చార్మినార్ జోన్‌లో మరీ తక్కువగా ఉన్నందున ఆ జోన్‌లో పనులు చేయకుండా ఉంటారా ? ఉంటే అక్కడి ప్రజాప్రతినిధులు ఊరుకుంటారా? ఈ నేపథ్యంలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.

**--ఎంఎంసీలోనూ..**
ఎంఎంసీలోనూ దాదాపుగా ఇదే పరిస్థితి. అక్కడి మూడు జోన్లలో మల్కాజిగిరి ఆస్తిపన్ను డిమాండ్ రూ.899 కోట్లు కాగా, వసూలైంది మాత్రం రూ.131 కోట్లే. ఈ కార్పొరేషన్‌లోని మూడు జోన్లలోనూ ఎక్కువశాతం ఆస్తిపన్ను వసూలైంది ఉప్పల్‌జోన్‌లో మాత్రమే. మిగతా జోన్లతో పోలిస్తే ఈ జోన్‌లో కల్పించాల్సిన మౌలిక సదుపాయాల పనులు ఎక్కువగా ఉన్నాయి.

**--సీఎంసీ బెటర్**
మూడు కార్పొరేషన్లలోనూ సైబరాబాదే బెటర్. డిమాండ్‌లో ఎక్కువశాతం ఆస్తిపన్ను వసూలైంది కూడా అక్కడే. అంతేకాదు, ఇప్పటికే ఫ్లై ఓవర్లు, రహదారులు, జంక్షన్లతో సహ ఎక్కువ సదుపాయాలున్నది ఇక్కడే కావడం తెలిసిందే. బహుళ అంతస్తుల నిర్మాణాలు, వాణిజ్య సముదాయాల డిమాండ్ కూడా ఇక్కడే ఎక్కువ కావడంతో భవిష్యత్‌లోనూ దీనికి నష్టమేం ఉండదు.

**--జీహెచ్ఎంసీకి కష్టం**
జీహెచ్ఎంసీ లోని గోల్కొండ జోన్‌లోనూ ఆస్తిపన్ను డిమాండ్ రూ. వెయ్యికోట్లకు పైగా ఉన్నప్పటికీ, వసూలైంది కేవలం రూ.97 కోట్లుమాత్రమే. ఈ నేపథ్యంలో క్యూర్ వరకు సమానాభివృద్ధి సాధ్యమేనా? అంటే, ప్రభుత్వం నిధుల ఆసరా ఇవ్వనిది మాత్రం అసాధ్యమంటున్నారు మున్సిపల్ వ్యవహారాల నిపుణులు.

## 5 నిమిషాలు చాలు..



15 నిమిషాలు కాదు 15 గంటలు, 15 రోజులు, 15 నెలలు అవసరమైతే 15 సంవత్సరాలు ఇచ్చినా మీరేం చేయలేరని అన్నారు. మీ పూర్వీకులే హిందువులను ఏం చేయలేకపోయారు మీరేం చేస్తారని మండిపడ్డారు. కానీ తమకు ఐదు నిమిషాల సమయం ఇవ్వాలని అన్నారు. తాను ఎక్కడకు రావాలో చెప్పాలని అన్నారు. నీ ప్రాంతానికి రావాలా, నీ ఇంటికి రావాలా, ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని అన్నారు. తనకు కత్తి, తుపాకీ ఏదీ వద్దని వ్యాఖ్యానించారు.

## కర్రెగుట్టలో పేలిన మందుపాతర



కర్రెగుట్టలో అమర్చిఉన్న మందుపాతరపై ఓ జవాన్ కాలి వేయడంతో అది ఒక్కసారిగా పేలింది. దాంతో తీవ్ర గాయాలైన జవాన్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ జవాన్‌ను హెలికాప్టర్‌లో హుటాహుటీనా ఆస్పత్రికి తరలించారు. సెర్చ్ ఆపరేషన్ చేస్తుండగా మందుపాతర పేలింది. ఈ ఘటనలో 39 బెటాలియన్‌కు చెందిన జవాన్ గాయపడ్డారు. గాయపడ్డ జవాన్‌ను నవజీత్ పటాకుగా గుర్తించారు. ఈరోజు(గురువారం, ఫిబ్రవరి 20వ తేదీ) ఉదయం నుంచి 11 ఐఈడీ( మందుపాతరలు) లను గుర్తించి నిర్వీర్యం చేశాయి సీఆర్పీఎఫ్ బృందాలు. కాగా, తెలంగాణ-ఛత్తీస్‌గడ్ సరిహద్దు ప్రాంతంలోని కర్రెగుట్ట అటవీ ప్రాంతంలో నిన్న(గురువారం, ఫిబ్రవరి 19వ తేదీ) భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పలువురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో అగ్రనేతలు ఉన్నట్లు తెలుస్తోంది. ఐదుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోగా, అందులో కీలక నేతలు ఉన్నట్లు సమాచారం. మృతిచెందిన వారిలో అగ్రనేత దేవ్‌జీ ఉన్నట్లు తెలుస్తోంది. కర్రెగుట్టలో ఆపరేషన్2లో భాగంగా 5 వేల మంది సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూంబింగ్ చేపట్టారు. మావోయిస్ట్ అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్2 కగార్ సాగుతోంది. మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సోది కోసం కూంబింగ్ చేపట్టగా.. మరో వైపు లొంగుబాటుకు అగ్రనేతలు సిద్ధమవుతున్నారు. ఇంకా 40 రోజులే ఆపరేషన్ కగార్ డెడ్‌లైన్ మిగిలి ఉంది.

## ఏపీలో క్రైమ్ రేటు 6 శాతం తగ్గింది



హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హోంశాఖ బడ్జెట్ డిమాండ్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సైబర్ నేరాల నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. వైసీపీ కార్యకర్తలు రప్పా రప్పా అంటూ రెచ్చగొట్టేలా ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని మంత్రి అనిత హెచ్చరించారు. రాష్ట్రాభివృద్ధికి లా అండ్ ఆర్డర్ చాలా ముఖ్యమని, అది లేకనే గత ప్రభుత్వంలో రాష్ట్రానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో లా అండ్ ఆర్డర్ చక్కగా పనిచేయడం వల్లే క్రైమ్ రేట్ తగ్గిందన్నారు. అందుకే దేశంలోనే ఎక్కువ పెట్టుబడులు సాధించిన రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచిందని చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో మహిళలు బయటకు రావడానికి కూడా భయపడేవాళ్లు అని, చట్టబద్ధత లేని దిశా యాప్ పేరుతో ప్రజలను మోసం చేశారన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి పాలనలో కూటమి ప్రభుత్వం మహిళల రక్షణకు కట్టుబడి ఉందన్నారు. శక్తి యాప్, శక్తి టీమ్స్ తో మహిళా రక్షణకు కృషి చేస్తున్నామని చెప్పారు. అందుకే రాష్ట్రంలో మహిళలపై నేరాలు 4.4 శాతం తగ్గాయని స్పష్టం చేసారు.తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని, గీత దాటితే కటకటాలే అని హెచ్చరించారు.సైబర్ క్రైమ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి జిల్లాలో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలకు వివిధ కార్యక్రమాలు ద్వారా అవగాహన కల్పిస్తున్నాం అన్నారు.

## అమీర్‌పేటలో అగ్నిప్రమాదం

సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని విద్యార్థులను బయటకు తరలిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా? ..కోతలు జరిగేటప్పుడు ఇస్తారా?



ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన 'రైతు బంధు' నిధులను ఇంకా విడుదల చేయకపోవడంపై ఆయన మండిపడ్డారు. శుక్రవారం ఆయన రైతు బంధు ఎప్పుడిస్తారు? అని సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. 'మున్సిపల్ ఎన్నికల కోడ్ అయిపోగానే 17వ తేదీన రైతుబంధు ఇస్తా అన్నాడు, 20వ తేదీ వచ్చింది. అయినా ఇంకా రైతుబంధు రాలేదు. రైతుబంధు నాట్లు వేసేటప్పుడు ఇస్తారా?.. కోతలు జరిగేటప్పుడు ఇస్తారా?' అని రేవంత్‌ను హరీశ సూటిగా ప్రశ్నించారు. 'ఇప్పటికే రెండు పంటలకు రైతు బంధు వేయలేదు, ఈ సారి అయినా వేస్తారా లేదా? బడా కాంట్రాక్టర్ల దగ్గర కమిషన్ల కోసం రూ.20వేల కోట్ల బకాయిలు చెల్లించావు కానీ రైతులకు రైతుబంధు వేయడానికి డబ్బులు లేవా?' అని కాంగ్రెస్ సర్కార్ దాటవేత ధోరణిపై హరీష్ రావు ధ్వజమెత్తారు.

## గురుకులాలకు మహర్దశ



రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం, భద్రతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. గురుకుల విద్యార్థులకు విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే వాటిని వేగంగా పరిష్కరించడంతో పాటు మెరుగైన పర్యవేక్షణ చేయాలని జిల్లా అధికారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేసింది. క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించడానికి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశాలు జారీ చేసింది. డిటైల్డ్ ఎంక్వైరీ క్యాలెండర్‌ను ముందుగానే తయారు చేయాలని స్పష్టం చేసింది. జిల్లా షెడ్యూల్‌కు అనుగుణంగా, సంబంధిత అన్ని విభాగాలకు వాటిని అందజేయాలని స్పష్టం చేసింది. నోడల్ అధికారులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాలని, విద్యా సంస్థల సరైన పనితీరును నిర్ధారించడానికి ఆకస్మిక సందర్శనలను కూడా నిర్వహిస్తారని వెల్లడించింది. అధికారులు గురుకుల పాఠశాలలను సందర్శించిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవడానికి తనిఖీ నివేదికలను తయారు చేసి వెంటనే అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. ఏ చర్యలు తీసుకున్నారో వెంటనే తెలియజేయాలని జిల్లా అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను ప్రతి నెల అయిదో తేదీలోపు సంబంధిత విభాగాధిపతులు, కార్యదర్శులకు తప్పకుండా సమర్పించాలని ఆదేశాల్లో ప్రభుత్వం పేర్కొంది.

# సునీత యాత్ర.. 'కల్పనా చావ్లా' తరహా ప్రాణాంతక వైఫల్యమే: నాసా సంచలన నివేదిక

**ఈ-కబురు, : భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ (Sunita Williams) వారం రోజుల అంతరిక్ష యాత్ర కాస్తా.. అనివార్య కారణాల వల్ల నెలల పాటు గడిచింది. యావత్ ప్రపంచం ఉత్కంఠగా చూసిన ఆ రోదసి యాత్రపై అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసా (NASA) తాజాగా ఓ నివేదిక విడుదల చేసింది. ఆ మిషన్ 'ప్రాణాంతక వైఫల్యమేనని' అంగీకరించింది. దానిని 'టైప్-ఏ' ప్రమాదంగా అభివర్ణించింది.**

వ్యోమగాములు సునీతా విలియమ్స్ (Sunita Williams), బుచ్ విల్‌మోర్ ప్రయాణించిన బోయింగ్ స్టార్‌లైనర్ మిషన్‌పై నాసా 311 పేజీల నివేదిక విడుదల చేసింది. ఈ సందర్భంగా నాసా చీఫ్ జేర్డ్ ఐజాక్‌మ్యాన్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. భద్రతాపరమైన హెచ్చరికలను విస్మరించి నాటి నాసా మేనేజ్‌మెంట్, బోయింగ్ మిషన్‌పై ముందుకెళ్లారని వెల్లడించారు. ''2024 జూన్‌లో ఈ మిషన్‌ను ప్రయోగించిన వెంటనే సమస్య మొదలైంది. రాకెట్‌కు థ్రస్ట్‌ను ఉత్పత్తి చేసే స్పేస్‌క్రాఫ్ట్ ప్రొపల్షన్ వ్యవస్థ విఫలమవడం ప్రారంభించింది. స్పేస్ స్టేషన్‌కు సమీపిస్తుండగానే ఐదు థ్రస్టర్లు పనిచేయడం ఆగిపోయాయి. దీనికితోడు హీలియం లీకేజీ మరింత భయపెట్టింది. అయితే, అదృష్టవశాత్తూ డాకింగ్ సురక్షితంగా పూర్తవడంతో వ్యోమగాములు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగలిగారు'' అని ఈ నివేదికలో వెల్లడించారు. భద్రతాపరమైన ప్రొటోకాల్స్‌ను పక్కనబెట్టి ప్రయోగాన్ని అనుకున్న షెడ్యూల్‌కు చేపట్టేలా నాసా మేనేజర్లపై ఒత్తిడి తెచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ మిషన్‌ను టైప్‌ఏ వైఫల్యంగా ధ్రువీకరించడంతో వ్యోమగాముల ప్రాణాలను పణంగా పెట్టి ప్రయోగం చేపట్టామని నాసా అంగీకరించినట్లయ్యింది.

**ఏంటీ టైప్-ఏ ప్రమాదం..?**

ఈ మిషన్‌ను నాసా 'టైప్‌ఏ' ప్రమాదంగా ప్రకటించడం ఏరోస్పేస్ ఇండస్ట్రీని షాక్‌కు గురిచేసింది. సాధారణంగా అత్యంత విపత్కర యాక్సిడెంట్లకు దీన్ని పేర్కొంటారు. 2003లో జరిగిన కొలంబియా షటిల్ డిజాస్టర్‌ను 'టైప్‌ఏ' ప్రమాదంగా పిలుస్తారు. ఆ ప్రమాదంలోనే భారత అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా సహా మరో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్పుడు కూడా ఇంజినీర్ల ఆందోళనలను పట్టించుకోకుండా మిషన్‌ను ప్రయోగించడంతో ఆ విషాదం చోటుచేసుకుంది. గతేడాది జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక 'స్టార్‌లైనర్'లో (Starliner) సునీత, విల్మోర్‌లు ఐఎస్ఎస్‌కు వెళ్లారు. ప్రణాళిక ప్రకారం వీరు 8 రోజులకే భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే, స్టార్‌లైనర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో వ్యోమగాములు లేకుండానే అది భూమికి తిరిగొచ్చింది. అనంతరం వీరిని తీసుకొచ్చేందుకు బోయింగ్ అనేక ప్రయత్నాలు చేసింది. చివరకు తొమ్మిది నెలల తర్వాత 2025 మార్చిలో వీరిద్దరూ సురక్షితంగా భూమిని చేరుకున్నారు.



# రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం .. వ్యక్తి మృతి



ఈ కబురు, భూదాన్ పోచంపల్లి: యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని రసాయన పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ధార పవన్ (35) అనే కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక దోతిగూడెంలోని ఫార్మా కంపెనీలో ప్రమాదవశాస్తు ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో కంపెనీలోని కార్మికులు, సిబ్బంది భయంతో బయటకు పరుగులు తీశారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ డీఎస్పీ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

# వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్ .. దాని వెనుక రూ.కోట్ల బంగారం




ఈ కబురు : పాత సినిమాల్లో చూపించినట్టుగా రాజస్థాన్ లోని ఒక వ్యాపారి ఇంట్లో సీక్రెట్ వాల్.. దానివెనక రూ.కోట్లు విలువచేసే బంగారమున్న స్ట్రాంగ్‌రూమ్ బయటపడింది. ఇదంతా చూసి ఐటీ సోదాలకు వచ్చిన అధికారులు విస్తుపోయారు. రూ.100కోట్ల పన్ను ఎగవేత ఆరోపణల్లో భాగంగా కన్హా గ్రూప్ కార్యాలయాల్లో సోదాలు జరిగాయి. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ప్రముఖ ఫుడ్ అండ్ బెవరేజ్ సంస్థ కన్హా గ్రూప్‌పై పన్ను ఎగవేత ఆరోపణలు రావడంతో మూడు రోజులుగా ఐటీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు నగరాల్లో ఉన్న 33 ప్రాంతాల్లో బుధవారం నుంచి తనిఖీలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజుల్లో గ్రూప్ యజమాని ఇల్లు, ఆఫీస్‌లో అనుమానాస్పద దస్త్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇక మూడో రోజు సోదాల్లో వారికి సీక్రెట్ వాల్ కనిపించింది. దానిని బద్దలుకొట్టి చూడగా.. వెనక ఒక రూమ్ ఉంది. దానిలో కోట్లు విలువచేసే బంగారు నగలు ఉన్నాయి. ఇప్పుడు ఆ మొత్తాన్ని లెక్కిస్తున్నారు. భారీగా వెలుగుచూసిన ఈ సంపద దర్యాప్తు తీరునే మార్చివేయనుందని అధికారులు పేర్కొన్నారు. ఇది కేవలం పన్ను ఎగవేత కిందికే రాదని, ప్రభుత్వం కళ్లు గప్పి సంపదను దాచి పెట్టడానికి చేసిన పక్కా ప్లాన్ అని వెల్లడించారు . బంగారంతో పాటు రూ.50లక్షల మేర నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ గ్రూప్‌నకు చెందిన పది బ్యాంక్ లాకర్లు బయటపడ్డాయి. వాటిలో కూడా లెక్కలోకి రాని నగదు, బంగారం ఉండొచ్చని భావిస్తున్నారు. 2008లో ఈ కన్హా గ్రూప్‌ను నట్వర్‌లాల్ స్థాపించారు. ఈ సంస్థ స్వీట్స్, బేకరీ ఉత్పత్తులను విక్రయిస్తోంది. దీని యజమానులు రూ.100 కోట్ల వరకు పన్ను ఎగవేతకు పాల్పడి, ఆ మొత్తాన్ని లగ్జరీ హోటళ్లలో పెట్టుబడి పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆ హోటళ్లలోనూ ఐటీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల వేళ కూడా ఈ గ్రూప్ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. కస్టమర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో వాటిని కొనసాగించేందుకు అధికారులు అనుమతించారు.

# ఏఐ సదస్సులో 8 ఏళ్ల బుడతడు.. ఎవరీ రణ్‌వీర్ సచ్‌దేవా?



ఈకబురు,: దేశ రాజధాని దిల్లీలో జరిగిన 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' (India AI Impact Summit)లో పలువురు దేశాధినేతలు, అనేక మంది టెక్ దిగ్గజాలు, విద్యావేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ క్రమంలో 8 ఏళ్ల ఓ బుడతడు ఈ అంతర్జాతీయ సదస్సులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. సదస్సులో అతిపిన్న కీనోట్ స్పీకర్‌గా నిలిచి అందర్నీ ఆశ్చర్యపరచడమే కాకుండా.. సుందర్ పిచాయ్, శామ్ ఆల్ట్‌మన్‌లతోనూ భేటీ అయ్యాడు. సోషల్ మీడియాలో మరోసారి వైరల్‌గా మారిన ఆ బాలుడే రణ్‌వీర్ సచ్‌దేవా (Ranvir Sachdeva).

దిల్లీకి చెందిన రణ్‌వీర్ సచ్‌దేవా నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నాడు. నాలుగేళ్ల వయసు నుంచే సాంకేతిక అంశాలపై అసాధారణ ప్రతిభ కనబరుస్తున్నాడు. కష్టమైన ఏఐ అంశాలనూ సులభంగా వివరిస్తుండటం అతడికి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆరేళ్ల వయసు ఉన్నప్పుడే టెక్నాలజీ, ఆవిష్కరణలపై టెడెక్స్ (TEDx) వేదికపై ప్రసంగించి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఇప్పటికే చోటు సాధించాడు. గతేడాది కేంద్ర విద్యాశాఖ నిర్వహించిన ఓ జాతీయస్థాయి వేడుకలోనూ కృత్రిమ మేధ, ఇతర అంశాలపై ప్రసంగించి అనేక మంది ప్రశంసలు అందుకున్నాడు. అంతేకాదు.. సచ్‌దేవా ఇప్పటికే ఓ పుస్తకం కూడా రాసినట్లు సమాచారం.

ఏఐ ఇంపాక్ట్ సదస్సులో కీలక ప్రసంగం చేసిన సచ్‌దేవా.. రోజువారీ జీవితంలో ఏఐకి పెరుగుతున్న ప్రాధాన్యంపై మాట్లాడాడు. ప్రాచీన భారతీయ తత్వాలను ఆధునిక సాంకేతికత ఎలా అనుసంధానిస్తుందనే విషయాన్ని ప్రధానంగా ప్రస్తావించాడు. జాతీయ పురోగతికి ఆవిష్కరణ ఏవిధంగా దోహదపడుతుందో సొంత అనుభవంతో వివరించాడు.

# ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరుద్ధం: అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు



టారిఫ్‌ల విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్(Donald Trump)కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. పలు దేశాలపై ఆయన విధించిన టారిఫ్‌లు చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంటూ అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఆయన తన అధికారాలను అతిక్రమించి సుంకాలు విధించారని పేర్కొంది. టారిఫ్‌ల విషయంలో ట్రంప్‌నకు వ్యతిరేకంగా ఆరుగురు జడ్జిలు, అనుకూలంగా ముగ్గురు జడ్జిలు తీర్పు ఇచ్చారు.

అత్యవసర అధికారాల చట్టం కింద ట్రంప్ ఏకపక్షంగా ప్రతీకార సుంకాలు సహా ఈ టారిఫ్‌లు విధించారని సుప్రీం కోర్టు పేర్కొంది. సుంకాలు సహా పన్నులు విధించే అధికారం పార్లమెంటుకే (US Congress) ఉందని రాజ్యాంగంలో స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేసింది. పన్నులు విధించే అధికారం ఏ కార్యనిర్వాహక విభాగానికీ అప్పగించలేదని సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ జాన్ రాబర్ట్స్ పేర్కొన్నారు. సుంకాలను కీలకమైన ఆర్థిక, విదేశాంగ విధానంగా ట్రంప్ ఉపయోగించుకున్నారని వ్యాఖ్యానించారు.

స్పందించిన ట్రంప్..

పలు రాష్ట్రాల గవర్నర్లతో ట్రంప్ సమావేశమైన సమయంలోనే ఈ తీర్పు వచ్చినట్లు సమాచారం. సుప్రీంకోర్టు తీర్పు అవమానకరమైనదిగా ట్రంప్ అభివర్ణించినట్లు తెలుస్తోంది. ఈ తీర్పు సమయంలో దాదాపు 20 రాష్ట్రాల గవర్నర్లతో ఆయన భేటీ అయినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు అధికారిక లెక్కల ప్రకారం.. భారత్ సహా వివిధ దేశాలపై విధించిన సుంకాల ద్వారా గత డిసెంబర్ నాటికి 133 బిలియన్ డాలర్ల ఆదాయం అమెరికా వాణిజ్య శాఖకు సమకూరినట్లు అంచనా.

సానుకూలంగా స్టాక్ మార్కెట్లు

సుంకాలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టు తీర్పు అక్కడి స్టాక్ మార్కెట్లలో జోష్ నింపింది. తీర్పు వెలువడిన కొన్ని నిమిషాల్లోనే సూచీలు పాజిటివ్‌గా స్పందిస్తున్నాయి.

# ఎల్బీనగర్ చట్నీస్ హోటల్‌లో పేలుడు






ఈ కబురు, హైదరాబాద్: ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో పేలుడు సంభవించింది. భారీ శబ్దానికి వినియోగదారులు పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు హోటల్ సిబ్బందికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇడ్లీ స్టీమర్‌లో పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న ఎల్బీనగర్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అధిక వేడిమి కారణంగానే స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు పేలుడు సంభవించిన కిచెన్‌ను పరిశీలించాయి. ఇడ్లీ స్టీమర్ వేడెక్కడంతోనే పేలుడు సంభవించిందా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# 'సర్' విధుల్లో జ్యుడిషియల్ అధికారులు.. సుప్రీం అసాధారణ నిర్ణయం

రాష్ట్రంలో కొనసాగుతున్న 'సర్' ప్రక్రియ పరిశీలనకు గ్రేడ్ ఏ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తీరును ప్రస్తావిస్తూ.. ''రెండు రాజ్యాంగబద్ధ విభాగాల మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణల పర్వం కొనసాగుతుండటం దురదృష్టకర పరిణామం. ఇది వ్యవస్థల మధ్య అపనమ్మకాన్ని రుజువు చేస్తోంది. అభ్యంతరాల స్వీకరణ దశలో ఈ ప్రక్రియ ఆగిపోయింది'' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. ఈ నేపథ్యంలోనే 'సర్' ప్రక్రియ కోసం జ్యుడిషియల్ అధికారులతోపాటు మాజీ న్యాయమూర్తుల సాయం తీసుకోవాలని, సంబంధిత అధికారులను నియమించుకోవాలంటూ కలకత్తా హైకోర్టుకు ఆదేశాలు జారీ చేసింది.

# బిట్‌కాయిన్ మోసం కేసు.. శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రాకు బెయిల్

ఈకబురు, : బిట్‌కాయిన్‌కు (Bitcoins) సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో బాలీవుడ్ నటి శిల్పాశెట్టి భర్త రాజ్‌కుంద్రా (Shilpa ShettyRaj Kundra) కొంతకాలంగా న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం ఈ కేసుపై విచారణకు హాజరైన రాజ్ కుంద్రాకు ముంబయి ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. తదుపరి విచారణల సమయంలో కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ED) దాఖలు చేసిన ఛార్జిషీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ముంబయిలోని పీఎంఎల్ఏ కోర్టు గత నెలలో వ్యాపారవేత్త రాజ్ కుంద్రాకు నోటీసులు జారీ చేసింది. ఈ క్రమంలోనే నేడు న్యాయస్థానం ముందు హాజరైన ఆయన ఈ కేసులో బెయిల్ ఇవ్వాల్సిందిగా పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం అందుకు అంగీకరించింది.

**ఈడీ ఆరోపణలు...** బిట్‌కాయిన్‌కు సంబంధించిన మనీలాండరింగ్ వ్యవహారంలో క్రిప్టో కుంభకోణం సూత్రధారి అమిత్ భరద్వాజ్ నుంచి రాజ్ కుంద్రా (Raj Kundra) రూ.150 కోట్ల విలువైన 285 బిట్‌కాయిన్లు అందుకున్నట్లు ఈడీ ఆరోపించింది. ఈ లావాదేవీలను, బిట్‌కాయిన్ (Bitcoins) వ్యాలెట్ అడ్రస్‌లను రాజ్ దాచిపెట్టారని పేర్కొంది. వాటి వివరాలు దాచిపెట్టేందుకు భార్య శిల్పాశెట్టితో ఆర్థిక ఒప్పందం కుదుర్చుకున్నారని కోర్టుకు తెలియజేసింది.

# ఏఐ సదస్సులో యూత్ కాంగ్రెస్ నిరసనలు..

ఈ కబురు : దిల్లీలోని భారత్ మండపంలో జరుగుతోన్న ఏఐ ఇంపాక్ట్ సమిట్ (AI Summit)లో యూత్ కాంగ్రెస్ నేతలు (Youth Congress members) ఆందోళన చేపట్టారు. శుక్రవారం వేదిక వద్దకు చేరుకున్న భారత యువజన కాంగ్రెస్ కార్యకర్తల బృందం చొక్కాలు విప్పి నిరసన తెలిపింది. మోదీ, ట్రంప్ చిత్రాలు ఉన్న టీ షర్టులతో.. అర్ధనగ్నంగా హాల్ నెంబర్ 5లోకి ప్రవేశించిన కార్యకర్తలు ప్రధాని మోదీ (PM Narendra Modi)కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ.. వారు ఆందోళన చేపట్టడంతో సమిట్‌లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. వెంటనే అప్రమత్తమైన దిల్లీ పోలీసులు నిరసనకారులను అరెస్ట్ చేశారు. వీరి ఆందోళనల వల్ల సదస్సుకు కొంత సమయం పాటు అంతరాయం కలిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రపంచ దేశాలు పాల్గొంటున్న సదస్సు (AI Summit)లో ఆందోళనకు పాల్పడిన యూత్ కాంగ్రెస్ నేతలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని దిల్లీ పోలీసులు తెలిపారు. సమిట్‌లోని హాళ్ల వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల తీరును భాజపా నేతలు తీవ్రంగా విమర్శించారు. ఒకపక్క ప్రపంచం దృష్టిని ఆకర్షించేలా తమ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఏఐ సమిట్‌ను నిర్వహిస్తుంటే.. మరో పక్క కాంగ్రెస్ కార్యకర్తలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని భాజపా (BJP) ఐటీ సెల్ హెడ్ అమిత్ మాలవీయ (Amit Malviya) మండిపడ్డారు. ప్రపంచ వేదికపై భారత్‌కు అపఖ్యాతిని తెచ్చేందుకే కాంగ్రెస్ ఈ కుట్రపూరిత చర్యలకు పాల్పడిందన్నారు. విదేశీ అతిథుల ముందు అర్ధనగ్నంగా నిరసన చేపట్టడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.




# అందమైన విషం.. ఈ లేడీ డాన్

## పోలీసులకు చిక్కిన 'మేడమ్ జహర్'





ఈకబురు, :దేశ రాజధాని దిల్లీలో మరో 'లేడీ డాన్' వ్యవహారం వెలుగుచూసింది. పగలు బ్యూటీ పార్లర్ నడుపుతూ సాదాసీదాగా కన్పించే ఆమె.. రాత్రిపూట భారీ డ్రగ్ సిండికేట్‌ను శాసిస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా కోసం పనిచేస్తోన్న లేడీ డాన్ (Delhi Lady Don) ఖుస్నుమా అన్సారీ అలియాస్ నేహను దిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టి ఆమె ఆట కట్టించారు. వివరాల్లోకి వెళితే..

ఇటీవల దిల్లీలోని మహిపాల్‌పుర్ ఫ్లైఓవర్ ప్రాంతంలో పోలీసులు భారీఎత్తున డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ కేసు దర్యాప్తు చేస్తుండగా పోలీసులకు 'మేడమ్ జహర్' పదం వినిపించింది. దీంతో తీగ లాగితే ఈ లేడీ డాన్ వ్యవహారం బయటపడింది. ఈశాన్య దిల్లీ (Delhi)లో బ్యూటీపార్లర్ నడిపే ఖుస్నుమానే ఈ 'మేడమ్ జహర్' అని పోలీసులు గుర్తించారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్, హషీమ్ బాబా ముఠాలకు ఆయుధాలు సరఫరా చేసే బాబీ కబూతర్‌కు ఈమె దీర్ఘకాల స్నేహితురాలు.

ఖుస్నుమా గత కొన్నేళ్లుగా దిల్లీలో డ్రగ్ సిండికేట్ నిర్వహిస్తోంది. ఈ అక్రమ వ్యాపారం బయటపడకుండా ఉండేందుకు బ్యూటీపార్లర్ ముసుగులో పగటిపూట సాదాసీదాగా కన్పిస్తోందని పోలీసులు వెల్లడించారు. డ్రగ్ డీలర్లు ఆమెను 'మేడమ్ జహర్' అని పిలుస్తారని దర్యాప్తులో గుర్తించారు. జహర్ అంటే తెలుగులో విషం అని అర్థం. నిఘా వర్గాల సమాచారం ఆధారంగా ఈ లేడీ డాన్‌తో పాటు ఆమె స్నేహితుడు బాబీ కబూతర్, మరో ఇద్దరిని దిల్లీ పోలీసులు స్పెషల్ సెల్ విభాగం అరెస్ట్ చేసింది. వీరి నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా ఆర్థిక కార్యకలాపాలు, ఇతర స్లీపర్ సెల్స్ గురించి తెలుసుకునేందుకు దర్యాప్తు చేస్తున్నామన్నారు. బాబీ కబూతర్ అసలు పేరు మహ్‌ఫూజ్. పాక్ ఐఎస్ఐతో సంబంధం ఉన్న సలీమ్ పిస్టోల్ అనే అక్రమాయుధాల డీలర్ నుంచి ఇతడు ఆయుధాలు కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఆ మధ్య పంజాబ్‌లో జరిగిన సిద్ధూ మూసేవాలా హత్య, నటి దిశా పటానీ ఇంటి వద్ద కాల్పుల ఘటనల్లో బాబీ ఇచ్చిన ఆయుధాలనే వినియోగించినట్లు ప్రాథమికంగా నిర్ధరించారు. కాగా.. ఇటీవల గ్యాంగ్‌స్టర్ల కోసం పనిచేసిన లేడీ డాన్‌లు దీప, జోయా ఖాన్‌ను కూడా దిల్లీ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.

# లాభాలతో ముగిసిన స్టాక్ మార్కెట్ సూచీలు

**ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నిన్నటి భారీ నష్టాల నుంచి బయటపడ్డాయి. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నా దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించడం గమనార్హం. ముఖ్యంగా పీఎస్‌యూ బ్యాంక్, మెటల్ స్టాక్స్‌లో కొనుగోళ్లు సూచీలకు దన్నుగా నిలిచాయి.**

**సెన్సెక్స్ ఉదయం 82,272.49 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,498.14) నష్టాలతో ప్రారంభమైంది. ఆపై లాభాల్లోకి వచ్చిన సూచీ.. ఇంట్రాడేలో 83,132.08 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 316.57 పాయింట్ల లాభంతో 82,814.71 వద్ద ముగిసింది. నిఫ్టీ 116.90 పాయింట్ల లాభంతో 25,571.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.02గా ఉంది.**

**సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, ఎల్‌అండ్‌టీ, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా స్టీల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ లాభపడ్డాయి. క్వాలిటీవాల్స్, టెక్ మహీంద్రా, ఇన్ఫోసిస్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 71.11 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5025 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.**




# ఏఐ వాడకపోతే..
## ప్రమోషన్లు కట్: యాక్సెంచర్ వార్నింగ్




కృత్రిమమేధతో కంపెనీల్లో పని సంస్కృతి మారుతోంది. తమ సిబ్బంది ఏఐను అందిపుచ్చుకొని, మెరుగైన పనితీరు చూపించాలని సంస్థలు కోరుకుంటున్నాయి. తాజాగా యాక్సెంచర్ (Accenture) చేసిన వార్నింగ్ ఆ తరహాలోనిదే. సీనియర్ ఉద్యోగులు ఏఐ టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని ఈ టెక్ సంస్థ సూచించింది. వాటి వినియోగం ఆధారంగానే లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేకపోతే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది. ఈ మేరకు సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ చేసిందని మీడియా కథనాలు వెల్లడించాయి.
కొంతకాలంగా యాక్సెంచర్ కృత్రిమ మేధ (Artificial Intelligence)పై ప్రధానంగా దృష్టిసారించింది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగాలను తొలగించింది. 11వేల మందికి లేఆఫ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ హెచ్చరిక చేయడం గమనార్హం. ఇదిలా ఉంటే.. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయొచ్చని గూగుల్ ఇప్పటికే తన ఉద్యోగులకు సూచించిన సంగతి తెలిసిందే. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీని ఆఫర్ చేసింది. మరోవైపు.. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్ (Google)కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. ఏఐని అందిపుచ్చుకునే విషయంలో మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

# అమెరికా వ్యూహాత్మక కూటమిలోకి భారత్.. 'ప్యాక్స్ సిలికా'లో చేరిక

**అమెరికా నేతృత్వంలో ఏర్పాటైన అంతర్జాతీయ వ్యూహాత్మక కూటమి 'ప్యాక్స్ సిలికా'లో భారత్ చేరింది. దిల్లీలోని ఏఐ ఇంపాక్ట్ సమిట్ వేదికగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ కూటమి (Pax Silica)లో చేరుతూ భారత్ సంతకం చేసింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా రాయబారి సెర్గియో గోర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.**

ఈ సంతకంతో కీలక ఖనిజాల ఉత్పత్తి, కృత్రిమ మేధ వంటి రంగాల్లో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. దీనిపై కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ''ప్రపంచం భారత్‌ను విశ్వసిస్తోంది. మన దగ్గర నిపుణుల కొరత లేదు. ఇప్పుడు ప్యాక్స్ సిలికా (India joined in Pax Silica)లో చేరడం వ్యూహాత్మక ముందడుగు. సెమీకండక్టర్ల సరఫరా గొలుసు, చిప్ తయారీ వంటి రంగాలకు ఇది చాలా కీలకం. ఈ కూటమిలో చేరడంతో భారత ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్ పరిశ్రమకు లబ్ధి చేకూరనుంది'' అని వెల్లడించారు.
అనంతరం సెర్గియో గోర్ మాట్లాడుతూ.. ''రెండు దేశాల మధ్య విస్తృత అవకాశాలకు కొదవలేదు. పాక్స్ సిలికాలో భారత్ చేరడం కీలక పరిణామం'' అని తెలిపారు. అంతేగాక, త్వరలోనే భారత ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముఖాముఖి భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు.

**ఏంటీ ప్యాక్స్ సిలికా..**

కృత్రిమమేధ పురోగతికి అవసరమైన సెమీ కండక్టర్ల సరఫరా గొలుసు భద్రత కోసం ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండేందుకు అమెరికా గతేడాది ఈ 'ప్యాక్స్ సిలికా' ప్రోగ్రామ్‌ను ఏర్పాటుచేసింది.




ఇందులో ఆస్ట్రేలియా, గ్రీస్, ఇజ్రాయెల్, జపాన్, ఖతర్, దక్షిణ కొరియా, సింగపూర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, యూకే సభ్యదేశాలుగా ఉన్నాయి. భవిష్యత్తులో ఏఐ, సాంకేతిక వ్యవస్థల అభివృద్ధి కోసం విశ్వసనీయ దేశాలన్నీ కలిసి ఓ భాగస్వామ్య ప్రణాళికను రూపొందించడమే ఈ కూటమి లక్ష్యం. అరుదైన ఖనిజాల కోసం చైనాపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రథమ ప్రాధాన్యంగా ఈ కూటమి ఏర్పడింది.

# ఏప్రిల్ నుంచి భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందం
## అమల్లోకి: పీయూష్ గోయల్



భారత్‌అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం (INDUS Interim Trade Agreement) ఖరారైన సంగతి తెలిసిందే. ఇది ఏప్రిల్ నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉందని శుక్రవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్‌గోయల్ వెల్లడించారు. అలాగే యూకే, ఒమన్‌తో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (FTA) కూడా అదే నెల నుంచి అమల్లోకి రావొచ్చని మంత్రి చెప్పారు. న్యూజిలాండ్‌తో కుదిరిన డీల్ అమల్లోకి రావడానికి మాత్రం సెప్టెంబర్ వరకు సమయం పట్టొచ్చని తెలిపారు.
మార్చిలో యూఎస్‌తో ఖరారైన మధ్యంతర ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేసే అవకాశం ఉందని ఇప్పటికే గోయల్ వెల్లడించిన సంగతి తెలిసిందే. భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ కూడా త్వరలో ఈ ఒప్పందంపై సంతకాలు జరగొచ్చని దిల్లీలో జరుగుతోన్న ఏఐ సదస్సులో భాగంగా వెల్లడించారు. అలాగే యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో రానున్న కొన్ని నెలల్లో భారత్‌లో పర్యటిస్తారని చెప్పారు. ఇదిలాఉంటే.. ఈ డీల్‌కు చట్టబద్ధంగా తుదిరూపును ఖరారు చేసేందుకు ఇరుదేశాల ప్రతినిధులు మూడు రోజుల పాటు సమావేశం కానున్నారు. ఫిబ్రవరి 23 నుంచి ఈ సమావేశం జరగనుంది.

# రిటైర్మెంట్ తర్వాత నెలకు
# రూ.20 వేలు ఆదాయం



**సీనియర్ సిటిజన్లు రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రశాంత జీవితం గడపడానికి కేంద్ర ప్రభుత్వం కొన్ని పథకాలు అమలు చేస్తోంది. అందులో ఒకటి సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్. పోస్టాఫీస్/బ్యాంకుల ద్వారా ఇందులో పెట్టుబడి పెడితే వృద్ధాప్యంలో క్రమబద్ధమైన ఆదాయం పొందొచ్చు. కనీసం రూ.1000 పెట్టుబడితో ఖాతాను ప్రారంభించొచ్చు. గరిష్ఠంగా రూ.30 లక్షల వరకూ పెట్టుబడి పెట్టొచ్చు. కేంద్ర ప్రభుత్వ పథకాల్లో అత్యధిక వడ్డీ అందిస్తున్న స్కీమ్ ఇదే. ప్రస్తుతం వార్షికంగా 8.2 శాతం వడ్డీ లభిస్తోంది. ఈ లెక్కన పదవీవిరమణ తర్వాత ఒకేసారి రూ.30 లక్షలు పెట్టుబడి పెడితే నెలకు రూ.20,500 చొప్పున వడ్డీ ఆదాయం పొందొచ్చు. మరిన్ని వివరాలకు వీడియో వీక్షించండి**

# కొత్త కారు కొంటున్నారా?



**సొంతంగా ఒక కారు ఉండటం ఇప్పుడు ఒక కనీస అవసరంగా మారింది. కారు కొనాలనే ఆలోచన రాగానే మొదట వచ్చే సందేహం దానికి కావాల్సిన నిధులను ఎలా సమకూర్చుకోవాలి? ఎంత పొదుపు చేయాలి? అనేది. సరైన ఆర్థిక ప్రణాళిక లేకపోతే కారు కొనుగోలు భవిష్యత్తులో భారంగా మారే అవకాశం ఉంటుంది. ఒక క్రమబద్ధమైన ప్రణాళికతో ముందడుగు వేస్తే ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు లేకుండా మీ ఇంటి ముందుకు కొత్త కారు వచ్చి చేరుతుంది.**

**కారు కొనుగోలులో తొలి దశ బడ్జెట్ నిర్ణయించుకోవడం. ప్రస్తుతం మార్కెట్‌లో మధ్య శ్రేణి కారు ధర సుమారు రూ.7లక్షల నుంచి రూ.10లక్షల వరకూ ఉంది. మీ ఆదాయం, అవసరాలు, వ్యక్తిగత ఇష్టాలను బట్టి, ఈ బడ్జెట్ మారొచ్చు. ఒకసారి ధరను నిర్ణయించుకున్నాక, తర్వాతి కాలంలో ఆ బడ్జెట్‌ను పెంచకుండా ఉండటం ఉత్తమం. ఉదాహరణకు, మీరు రూ.7 లక్షల కారును కొనాలని నిర్ణయించుకున్నారనుకుందాం.**

**కారు లోన్ తీసుకోవడం: దీనివల్ల తక్షణమే కారును ఇంటికి తెచ్చుకోవచ్చు. ప్రస్తుతం చాలా బ్యాంకులు కారు ధరలో 80-90% వరకు రుణం ఇస్తున్నాయి. మిగిలిన 20 మొత్తాన్ని డౌన్ పేమెంట్‌గా చెల్లించాల్సి ఉంటుంది. అంటే రూ. 7 లక్షల కారుకు మీరు రూ.1.4 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మిగిలిన మొత్తాన్ని 7 ఏళ్ల కాల పరిమితితో ఈఎంఐల రూపంలో చెల్లించవచ్చు.**

**పొదుపు చేయడం: కొంతకాలం ఆగి, తగినంత సొమ్ము జమ అయ్యాక కారును కొనుగోలు చేయడం. దీనివల్ల వాయిదాల భారం ఉండదు.**

**కారు రుణం సౌకర్యవంతంగా అనిపించినప్పటికీ, ఇందులో కొన్ని ఇబ్బందులూ ఉన్నాయి. కారు అసలు ధర కంటే చాలా ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సి వస్తుంది. వడ్డీతో పాటు లోన్ ప్రాసెసింగ్ ఫీజులు, జీఎస్‌టీ వంటి అదనపు ఖర్చులు తోడవుతాయి. అంతేకాకుండా, సుమారు 7 ఏళ్ల పాటు ప్రతి నెలా ఈఎంఐ చెల్లించడం ఒక భారంగా మారుతుంది. అదే మీరు పొదుపు చేసి కొంటే, ఈ అదనపు ఖర్చులు తగ్గడమే కాకుండా ఆర్థిక ప్రశాంతత లభిస్తుంది.**

**అయిదేళ్ల తర్వాత కారు కొనాలని లక్ష్యంగా పెట్టుకుంటే, అప్పటికి కారు ధర ఎంత ఉండవచ్చో అంచనా వేయడం ముఖ్యం. గత పదేళ్ల తీరును గమనిస్తే, భారతదేశంలో కార్ల ధరలు ఏటా సగటున 10% పెరుగుతున్నాయి. ఇదే కొనసాగితే, నేడు రూ.7 లక్షలు ఉన్న కారు అయిదేళ్ల తర్వాత సుమారు రూ.11.27 లక్షలకు చేరుతుంది. కాబట్టి మీ 5 ఏళ్ల పొదుపు లక్ష్యం రూ. 11.27 లక్షలుగా ఉండాలి.**

**ఎక్కడ పెట్టుబడి పెట్టాలి?**

**5 ఏళ్ల కాల పరిమతి కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు కొంత నష్టభయంతో కూడుకున్నవి. దీనికి బదులుగా హైబ్రిడ్ ఫండ్లు ఎంచుకోవడం ఉత్తమం. ఇవి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పెట్టుబడి పెడతాయి. మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు ఈక్విటీ ద్వారా మంచి రాబడులు, మార్కెట్లు ఒడుదొడుకుల్లో ఉన్నప్పుడు డెట్ ఇన్వెస్ట్‌మెంట్ల ద్వారా రక్షణ లభిస్తుంది.**

**మ్యూచువల్ ఫండ్లలో క్రమబద్ధమైన పెట్టుబడి విధానం ద్వారా మీ లక్ష్యాన్ని సులభంగా చేరుకోవచ్చు. రూ.11.27 లక్షల లక్ష్యాన్ని చేరుకోవడానికి వివిధ రాబడి శాతం ప్రకారం నెలకు ఎంత పొదుపు చేయాలంటే...**


**8% సగటు రాబడితో: నెలకు రూ. 15,240**

**10% సగటు రాబడితో: నెలకు రూ. 14,436**

**12% సగటు రాబడితో: నెలకు రూ. 13,670**

**ఆర్థిక నిపుణుల సూచన ప్రకారం, గరిష్ఠంగా నెలకు రూ.15,240 పొదుపు చేయడం మంచిది. ఒకవేళ మీకు 8% కంటే ఎక్కువ రాబడి వస్తే, ఆ అదనపు సొమ్ముతో మీరు అనుకున్న దానికంటే మెరుగైన మోడల్ లేదా ప్రీమియం కారును కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది.**

# టోల్ ప్లాజాల వద్ద ఇక డిజిటల్ చెల్లింపులు మాత్రమే



దిల్లీ: జాతీయ రహదారులపై టోల్ ప్లాజాల వద్ద ఫీజు చెల్లింపులకు పూర్తిగా డిజిటల్ లావాదేవీలను మాత్రమే అనుమతించే అంశాన్ని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (NHAI) పరిశీలిస్తోంది. ఏప్రిల్ 1 నుంచి నగదు లావాదేవీలను పూర్తి నిలిపివేయాలనుకుంటోంది. ఫాస్టాగ్ లేదా యూపీఐ ద్వారా మాత్రమే టోల్‌ఫీజు వసూలు చేయాలని అనుకుంటోంది. జాతీయ రహదారుల టోల్ ఎకోసిస్టమ్‌ను పూర్తిగా డిజిటల్‌గా మార్చే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ ఓ ప్రకటనలో పేర్కొంది.

టోల్ చెల్లింపుల్లో చాలా వరకు ఫాస్టాగ్ ద్వారానే జరుగుతున్నాయి. దాదాపు 98 శాతం పేమెంట్లు ఈ రూపంలోనే జరుగుతున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. అయితే, ఫాస్టాగ్ లేకపోవడం, పనిచేయకపోవడం వంటి కారణాలతో టోల్‌ప్లాజా వద్దకు వచ్చే వాహనాల నుంచి రెండింతల ఫీజు వసూలు చేస్తున్నారు. యూపీఐ ఆప్షన్ ఎంచుకుంటే 1.25 రెట్లు ఫీజు మాత్రమే తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో టోల్‌ప్లాజాల వద్ద పూర్తిగా డిజిటల్ రూపంలో చెల్లింపులకు మాత్రమే అనుమతివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ భావిస్తోంది. టోల్‌ప్లాజాల వద్ద రద్దీని తగ్గించడం, ప్రయాణ సమయాన్ని ఆదా చేయడం, రుసుముల వసూళ్లలో పారదర్శకత కోసం ఎన్‌హెచ్‌ఏఐ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో జాతీయరహదారులు, ఎక్స్‌ప్రెస్‌వేలపై 1150 టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

## విరోధం పెట్టుకొని బతకలేవు.. మోస్ట్ వైలెంట్‌గా 'టాక్సిక్' టీజర్..




యశ్ హీరోగా గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'టాక్సిక్'. 'ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' అనేది ఉప శీర్షిక. ఇందులో యశ్‌తో పాటు అయిదుగురు హీరోయిన్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. నదియా పాత్రలో కియారా కనిపించనుండగా హ్యూమా ఖురేషీ ఎలిజెబెత్‌గా, నయనతార గంగ పాత్రలో, రెబెకాగా తారా సుతారియా, మెలిసా అనే పాత్రలో రుక్మిణి వసంత్ ఆకట్టుకోనున్నారు. మార్చి 19న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తాజాగా దీని టీజర్‌ను విడుదల చేశారు (Toxic Teaser). విరోధం పెట్టుకొని బతకలేవు.. పట్టుదల వదిలేయ్ అనే డైలాగులతో మోస్ట్ వైలెంట్‌గా రాయాపాత్రలో యశ్ కనిపించారు.



## మా రాజు.. మా గర్వం

ఛత్రపతి శివాజీ జీవితం ఆధారంగా బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తోన్న చిత్రం 'రాజా శివాజీ'. ఇందులో అభిషేక్ బచ్చన్, సంజయ్ దత్, జెనీలియా, విద్యాబాలన్ తదితరులు నటిస్తున్నారు. రెండేళ్ల క్రితమే ప్రకటించిన ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని ఇన్‌స్టాలో రితేశ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆవిష్కరించింది చిత్రబృందం. "చీకటి వెలుగు కోసం తారసపడుతున్నప్పుడు.. ఓ జ్వాల పైకి లేచింది.. అలానే చరిత్ర నిలిచిపోయినప్పుడు ఒక యోధుడు దానిని తిరిగి రాయాలనుకున్నాడు.. 'మా రాజు.. మా గర్వం.. మా వారసత్వం" అనే వ్యాఖ్యల్ని జోడించింది. ఇంతకు ముందెన్నడూ చూడని సినిమాటిక్ దృశ్యంతో ఈ సినిమాని రూపొందిస్తున్నట్లు దర్శకుడు పేర్కొన్నారు. ఈ సినిమాని జియో స్టూడియోస్, ముంబయి ఫిల్మ్ కంపెనీ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.

## ఎవరూ ఊహించని పాత్రలో రష్మిక..
## వైరలవుతోన్న న్యూస్!

- లెస్బియన్ జంటగా కృతి సనన్, రష్మిక!
- ట్రయాంగిల్ లవ్ స్టోరీగా కాక్ టెయిల్ 2
- జనవరి 31న షూటింగ్ పూర్తి.. త్వరలో రిలీజ్





వరుస విజయాలతో దూసుకుపోతున్న రష్మిక మందన్న, ఇప్పుడు మరో ప్రయోగాత్మక పాత్రతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. బాలీవుడ్‌లో మోస్ట్ అవేటెడ్ మూవీగా భావిస్తున్న 'కాక్‌టెయిల్ 2'లో ఆమె పోషిస్తున్న పాత్ర గురించి ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వార్త వైరల్ అవుతోంది. షాహిద్ కపూర్ ప్రధాన పాత్రలో రానున్న ఈ చిత్రంలో కృతి సనన్, రష్మిక మందన్న కీలక పాత్రలు పోషిస్తున్నారు.

బాలీవుడ్ మీడియా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో వీరిద్దరూ స్వలింగ ప్రేమికులుగా కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారిక సమాచారం రాకపోయినప్పటికీ వీరి పాత్రల గురించి ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది. ఇదొక విభిన్నమైన ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని, రష్మికకృతి పాత్రల మధ్య కెమిస్ట్రీ సినిమాకే హైలైట్‌గా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. దీనిపై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, ఈ వార్త సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

షూటింగ్ పూర్తి.. త్వరలోనే రిలీజ్
హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ జనవరి 31వ తేదీతో పూర్తయింది. 2012లో సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె నటించిన సూపర్ హిట్ 'కాక్‌టెయిల్' చిత్రానికి ఇది సీక్వెల్‌గా వస్తోంది. ఈ సినిమాలో షాహిద్ మునుపెన్నడూ చూడని సరికొత్త లుక్‌లో కనిపిస్తారని దర్శకుడు వెల్లడించారు. త్వరలోనే ఈ మూవీ రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామని చెప్పారు. విభిన్న పాత్రలతో తన మల్టీటాలెంట్‌ను నిరూ

## ముంబయిలో షూటింగ్..
## చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టిన ప్రభాస్

- కపుల్ ఫ్రెండ్లీ' చూసి ఆ ఫీల్ నుంచి బయటకు రావడానికి చాలాసేపు పట్టిందని ప్రభాస్ (Prabhas) అన్నారు. చివరి 20 నిమిషాలు మరో స్థాయిలో ఉందని ప్రశంసించారు. తాజాగా ఈ మూవీ టీమ్ ప్రభాస్‌ను కలిసింది. ఆ చిత్ర బృందంతో ప్రభాస్ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. విజయవాడ పునుగులు అంటే తనకు ఇష్టమని చెప్పారు.



''నేను అభిమానుల కోసం సంవత్సరానికి మూడు, నాలుగు సినిమాల్లో నటిస్తున్నాను. కానీ, ఒక్కటే విడుదలవుతోంది. నాకు 'గీతాంజలి' అంటే చాలా ఇష్టం. అందరూ నాకు యాక్షన్ చిత్రాలంటే ఇష్టమనుకుంటారు. నాకు అన్ని జానర్‌ల పైనా ఆసక్తి ఉంది. ప్రత్యేకించి మణిరత్నం అభిమానిని.
'కపుల్ ఫ్రెండ్లీ' (Couple Friendly) చూసినప్పుడు నాకు 'గీతాంజలి' చూస్తున్న ఫీల్ కలిగింది. అందుకే నాలుగు సార్లు చూడాలని నిర్ణయించుకున్నాను''
''పూరి జగన్నాథ్‌లా ఎవరూ రాయలేరు. ఆయన 'బుజ్జిగాడు' కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. ఎలా చేయాలి అని టెన్షన్ వచ్చింది. తర్వాత ఆయన దర్శకత్వంలో 'ఏక్ నిరంజన్' చేశా. ఆయనలా డైలాగులు రాసేవాళ్లు ప్రపంచంలోనే లేరు. ఆయనది ఒక ప్రత్యేకమైన శైలి. నా సినిమాల్లో కాస్ట్యూమ్స్ కూడా డిఫరెంట్‌గా ఉండేలా చూస్తాను''
''అందరికీ నా ఫుడ్ గురించి తెలుసుకోవాలని ఉంటుంది. మీకో ఆసక్తికర విషయం చెబుతాను. నేను అప్పుడప్పుడు వేరే రాష్ట్రాల నుంచి ఫుడ్ ఆర్డర్ పెడతాను. 'ఆదిపురుష్' షూటింగ్ ముంబయిలో జరిగేటప్పుడు చెన్నై నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టా. టీమ్ అందరూ షాక్ అయ్యారు. ఫ్లైట్‌లో ఆర్డర్ తీసుకొచ్చిన వ్యక్తి నా దగ్గరకు వచ్చి 'మీరు మాములు వాళ్లు కాదండీ' అన్నాడు'' అని ప్రభాస్ గుర్తుచేసుకున్నారు.
'మీ దృష్టిలో ప్రేమంటే ఏంటి?' అని హీరోయిన్ మానస వారణాసి అడగ్గా.. పర్సనల్ క్వశ్చన్ కదా అంటూ ప్రభాస్ నవ్వులు పూయించారు. లవ్ అనగానే ప్రస్తుతానికి 'కపుల్ ఫ్రెండ్లీ' గుర్తొస్తుందన్నారు. ఈ సినిమా చూశాక ప్రేమలో పడాలని ఉందన్నారు. హీరో సంతోశ్ శోభన్ అడిగిన వెంటనే.. అతడికి ఫోన్ నంబరు ఇచ్చారు. ఈ మూవీ బ్యాక్‌డ్రాప్ గురించి ప్రభాస్ మాట్లాడుతూ.. చెన్నైలో తాను గడిపిన రోజులు గుర్తుచేసుకున్నారు. ప్రభాస్‌కు హిట్ ఇచ్చిన 'వర్షం' డైరెక్టర్ శోభన్ తనయుడే ఈ సంతోశ్.

## మిస్టిక్ థ్రిల్లర్ కథలో!

ఒక ప్రత్యేకమైన ప్రపంచాన్ని ఆవిష్కరించే కథ... అందులో అబ్బురపరిచే ఫాంటసీ అంశాలు, భక్తి కోణం, థ్రిల్లింగ్‌గా సాగే కథనం... ఇలాంటి మేళవింపుతో కూడిన మిస్టిక్ థ్రిల్లర్ సినిమాలు ఈ మధ్య ప్రేక్షకుల మనసుల్ని గెలుస్తున్నాయి. 'విరూపాక్ష' మొదలుకొని పలువురు కథానాయకులు ఈ తరహా కథలతో విజయాల్ని సొంతం చేసుకున్నారు. కల్యాణ్‌రామ్ కొత్త సినిమా కూడా మిస్టిక్ థ్రిల్లర్ కథతోనే రూపొందనున్నట్టు తెలుస్తోంది. కల్యాణ్‌రామ్ తదుపరి సినిమా ప్రముఖ రచయిత శ్రీకాంత్ విస్సా దర్శకత్వంలో రూపొందనుంది. ఇప్పటికే కథా చర్చలు పూర్తయ్యాయి. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. త్వరలోనే ఈ సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమవుతోంది. రచయితగా మంచి పేరున్న శ్రీకాంత్ విస్సా దర్శకుడిగా పరిచయం అవుతున్న చిత్రమిదే. ఆయన విభిన్నమైన మిస్టిక్ థ్రిల్లర్ కథతో, భారీస్థాయి సినిమాని రూపొందించనున్నట్టు తెలుస్తోంది. విజువల్‌గా ప్రత్యేకమైన అనుభూతిని పంచే సినిమాల్ని ఇష్ట



పడుతున్న ప్రేక్షకుడి అభిరుచుల్ని దృష్టిలో ఉంచుకునే శ్రీకాంత్ విస్సా ఈ చిత్రాన్ని రూపొందించనున్నారు.

## మానస వారణాసి అదృష్టం
## మామూలుగా లేదే!

- తెలంగాణ బ్యూటీగా మానస వారణాసి
- 'కపుల్ ఫ్రెండ్లీ'తో దక్కిన హిట్
- ఒక్కసారిగా పెరిగిన క్రేజ్
- కొత్త ప్రాజెక్టులు క్యూ కడుతున్నట్టు టాక్



వెండితెరపై హీరోయిన్ గా కనిపించాలంటే అందం ఒక్కటే వుంటే సరిపోదు .. అదృష్టం కూడా ఉండాలి. ఎందుకంటే ఎంతటి గ్లామర్ ఉన్నప్పటికీ .. టాలెంట్ ఉన్నప్పటికీ .. స్టార్ డమ్ దక్కడం అంత తేలికగా జరగదు. చాలామంది హీరోయిన్స్ తమ సినిమా హిట్ అయితే చాలు, తమ మార్కెట్ .. పారితోషికం పెరిగిపోతుందని అనుకుంటారు. కానీ సినిమా హిట్ అయినా ఒక్కోసారి ఆ క్రెడిట్ ఎవరి ఎకౌంటులోకో వెళ్లిపోతూ ఉంటుంది. అందుకే అంటారు అదృష్టం కూడా ఉండాలని. హీరోయిన్స్ ఒకప్పటి మాదిరిగా తెరపై ఎక్కువ కాలం పాటు రాజ్యం చేసే పరిస్థితి లేదు. అందువలన ప్రతి సినిమా వాళ్లకి చాలా విలువైనదిగానే కనిపిస్తూ ఉంటుంది. హిట్ అయిన సినిమాతో మరింత పాప్యులర్ కావాలనే కోరుకుంటూ ఉంటారు. అయితే ఒక్కోసారి మొదటి ప్రయత్నం నిరాశపరిచినా, రెండో ప్రయత్నంతో దశ తిరిగిపోతూ ఉంటుంది. అలాంటి అందాల నాయికల జాబితాలో తాజాగా మానస వారణాసి పేరు కూడా చేరిపోయింది. మానస వారణాసి తెలంగాణ అమ్మాయి. అనేక అందాల పోటీలలో బహుమతులు గెలుచుకున్న నాజూకు నాయిక. 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమా తరువాత అంతా ఈ బ్యూటీని గురించే మాట్లాడుకుంటున్నారు. పొన్నాగి పూలతో పోతబోసినట్టు .. తామర రేకులతో రాశి పోసినట్టుగా కనిపించే ఈ సుందరి పేరు ఇప్పుడు యూత్ జపించే మధురమైన మంత్రమైపోయింది. ప్రస్తుతం టాలీవుడ్ లో గట్టిపోటీలేదు. ఇలాంటి సమయంలో ఎంట్రీ ఇవ్వడం ఈ భామకి కలిసొచ్చే విషయం. యంగ్ హీరోలంతా తమ ప్రాజెక్టుల కోసం ఇప్పుడు ఈ బ్యూటీని రికమెండ్ చేస్తున్నట్టుగా టాక్. సౌందర్యానికి సరైన అర్థంలా కనిపించే మానస వారణాసి, మున్ముందు మరెన్ని మహిమలు చేస్తుందో చూడాలి.

## రూ.10 కోట్లు చెల్లించండి.. రణ్‌వీర్‌సింగ్‌కు బిష్ణోయ్ గ్యాంగ్ మరోసారి బెదిరింపులు



బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ కు వరుస బెదిరింపులు రావడం చర్చనీయాంశంగా మారింది. శుక్రవారం ఉదయం మరోసారి బెదిరింపులు వచ్చాయి. రూ.10 కోట్లు డిమాండ్ చేస్తూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఓ వ్యక్తి నటుడికి వాయిస్ నోట్ పంపినట్లు బాలీవుడ్ మీడియా పేర్కొంది. అమెరికాలో రిజిస్టర్ అయిన నంబర్ నుంచి ఈ వాయిస్ నోట్ వచ్చినట్లు సమాచారం. దీనిపై ముంబయి క్రైమ్ బ్రాంచ్ పోలీసులు సంబంధిత అమెరికా దర్యాప్తు సంస్థలను సంప్రదిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కూడా బాలీవుడ్ ప్రముఖులకు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన హ్యారీ బాక్సర్‌గా పరిచయం చేసుకున్న ఓ వ్యక్తి కొందరు సెలబ్రిటీలకు వాట్సప్‌లో వాయిస్ నోట్ పంపాడు. తన డిమాండ్‌లను అంగీకరించకపోతే సిబ్బంది అందరినీ హత్య చేస్తానని బెదిరింపులకు పాల్పడ్డాడు. "మీ మేనేజర్ దగ్గర నుంచి మీ వద్ద పనిచేసే వ్యక్తిగత సిబ్బంది వరకూ అందరి వివరాలు మాకు తెలుసు. వారు కుటుంబాలతో ఎక్కడ నివసిస్తున్నారో కూడా తెలుసు. మా టార్గెట్ వాళ్లే. వాళ్లకు ఏం జరగకముందే మీరు మారండి" అని ఆడియో పంపాడు.


## ఓటీటీకి వచ్చేసిన హారర్ థ్రిల్లర్ .. 'ఈషా'



- డిసెంబర్ 12న విడుదలైన 'ఈషా'
- నలుగురు స్నేహితుల చుట్టూ తిరిగే కథ
- థియేటర్స్ నుంచి మంచి రెస్పాన్స్
- రీసెంటుగా ఓటీటీకి వచ్చిన సినిమా

హారర్ థ్రిల్లర్ సినిమాలు అనగానే, దాదాపు తక్కువ బడ్జెట్ లో కానిచ్చేస్తారనే అనే ఒక అభిప్రాయం వినిపిస్తూ ఉంటుంది. కంటెంట్ పై పెద్దగా దృష్టి పెట్టారని చెప్పుకుంటూ ఉంటారు. అయితే ఆ మధ్య వచ్చిన 'మసూద' .. అలాంటి అభిప్రాయాన్ని మార్చేసిందని చెప్పాలి. అదే పద్ధతిని కొనసాగిస్తూ ఆడియన్స్ కి ఉత్కంఠను పెంచిన మరి హారర్ థ్రిల్లర్ సినిమాగా 'ఈషా' కనిపిస్తుంది. శ్రీనివాస్ మన్నే దర్శకత్వం వహించిన సినిమా ఇది.
డిసెంబర్ 12వ తేదీన విడుదలైన ఈ సినిమాలో త్రిగుణ్ .. హెబ్బా పటేల్ .. అఖిల్ రాజ్ .. సిరి హనుమంతు ప్రధానమైన పాత్రలను పోషించారు. థియేటర్ల నుంచి మంచి రెస్పాన్స్ ను రాబట్టిన ఈ సినిమా, రీసెంటుగా అమెజాన్ ప్రైమ్ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. ఓ మాదిరి కంటెంట్ తో ఈ సినిమాను రూపొంది ఉండొచ్చని చాలామంది అనుకున్నారు. కానీ వారి అంచనాలను తలక్రిందులు చేస్తూ ఈ సినిమా భయపెట్టగలిగింది.
చిన్నప్పటి నుంచి కలిసి పెరిగిన నలుగురు స్నేహితులు, దెయ్యాలు ప్రేతాత్మలు లేవని బలంగా నమ్ముతూ ఉంటారు. దెయ్యాల పేరుతో భయపెడుతున్న దొంగ స్వామీజీలను పట్టుకుని, తమ నమ్మకాన్ని వెలుగులోకి తెస్తూ ఉంటారు. అలా ఆదిదేవ్ అనే ఒక స్వామీజీని కూడా పట్టించాలనే ఉద్దేశంతో, ఆంధ్ర ఒడిశా బోర్డర్ కి ఈ నలువురు ఫ్రెండ్స్ బయల్దేరతారు. అక్కడ వాళ్లకి ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయి? అనేది మిగిలిన కథ.

## శ్రీ విష్ణు 'మృత్యుంజయ్' రిలీజ్ డేట్ మారింది... ఆ సినిమా కోసమే!






- వాయిదా పడిన శ్రీ విష్ణు 'మృత్యుంజయ్' చిత్రం
- ఫిబ్రవరి 27 బదులు మార్చి 6న థియేటర్లలోకి
- కొత్త పోస్టర్‌తో అధికారికంగా ప్రకటించిన శ్రీ విష్ణు
- హుస్సేన్ షా కిరణ్ దర్శకత్వంలో వస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్

ప్రముఖ నటుడు శ్రీ విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'మృత్యుంజయ్' విడుదల తేదీలో మార్పు జరిగింది. ముందుగా ప్రకటించినట్టు ఫిబ్రవరి 27న కాకుండా, ఈ చిత్రాన్ని మార్చి 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

ఈ విషయాన్ని హీరో శ్రీ విష్ణు తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించారు. "రిలీజ్ డేట్ మారింది, థ్రిల్ కాదు" అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ పోస్టర్‌లో శ్రీ విష్ణు భయంకరమైన ఆయుధంతో ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచారు.

హుస్సేన్ షా కిరణ్ ఈ చిత్రానికి రచన, దర్శకత్వం వహిస్తుండగా, సందీప్ గున్నం, వినయ్ చిలకపాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. శ్రీ విష్ణుకు జోడీగా రెబా మోనికా జాన్ నటిస్తోంది. కాల భైరవ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌కు ఇప్పటికే అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి సైతం టీజర్‌ను ప్రశంసించడం విశేషం.

శ్రీ విష్ణు నటిస్తున్న మరో చిత్రం 'విష్ణు విన్యాసం' కూడా విడుదలకు సిద్ధమవుతోంది. 'విష్ణు విన్యాసం' ఫిబ్రవరి 28న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో రెండు సినిమాల ప్రమోషన్లకు ఇబ్బంది లేకుండా ఉండేందుకే 'మృత్యుంజయ్' విడుదల తేదీని మార్చినట్లు తెలుస్తోంది. మరి మార్చి 6న థియేటర్లలోకి రానున్న ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి.

## ఐసీసీ 'ప్రి సీడింగ్' ఫార్మాట్‌పై విమర్శలు..
## గతంలో ఎలా ఉందంటే?




టీ20 ప్రపంచ కప్ 2026 లీగ్ స్టేజ్ మ్యాచ్‌లను ముగించుకొని.. సూపర్ 8 పోరుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఐసీసీ నిర్ణయించిన 'ప్రి సీడింగ్' ఫార్మాట్‌పై విమర్శలు వచ్చాయి. గతంలోనూ పలుమార్లు ఐసీసీకి ఈ పరిస్థితి ఎదురైంది. అసలేంటి ఆ ఫార్మాట్? ఐసీసీ ఏం చెబుతోంది? గతంలో ఎలాంటి విధానం ఉండేదో చూద్దాం.. ఈసారి 20 జట్లతో టీ20 ప్రపంచ కప్‌ను ఐసీసీ నిర్వహిస్తోంది. లీగ్ స్టేజ్‌లో ఐదేసి జట్లను నాలుగు గ్రూప్‌లుగా విడగొట్టింది. ఇప్పటి వరకు ఇదంతా బాగానే ఉంది. టాప్ 2 టీమ్‌లు సూపర్ 8కి అర్హత సాధించాయి. ఇక్కడ పాయింట్లపరంగా కాకుండా.. ప్రి సీడింగ్ అంటే ఐసీసీ ర్యాంకులనుబట్టి సూపర్ 8 గ్రూప్‌ల్లో ఏ జట్టు ఉంటుందో ఐసీసీ ముందే నిర్ణయించింది. ప్రేక్షకులు, మీడియా, ఆటగాళ్ల రవాణా ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఇలా వ్యవహరించింది. అయితే, అగ్రస్థానంతో లీగ్ స్టేజ్‌ను ముగించిన నాలుగు టీమ్‌లు సూపర్ 8లో ఒకే గ్రూప్ కావడంతో విమర్శలకు దారితీసింది. ఇలా చేయడం వల్ల సెమీస్‌కు చేరుకొనేందుకు టాప్ టీమ్‌లకు అవకాశం లేకుండా పోతుందనేది అభిమానుల వాదన. గ్రూప్ 1.. భారత్, జింబాబ్వే, వెస్టిండీస్, దక్షిణాఫ్రికా, గ్రూప్ 2.. శ్రీలంక, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, పాకిస్థాన్ , గత పోట్టి కప్‌ల్లో ఎలా ఉండేదంటే? తొలిసారి టీమ్‌ఇండియా ఛాంపియన్ అయిన 2007 టీ20 ప్రపంచ కప్ నుంచి 2016 ఎడిషన్ వరకూ ఫార్మాట్ ఒకేలా ఉండేది. గ్రూప్‌లుగా విడిపోయి.. అక్కడ నుంచి సూపర్8 లేదా సూపర్ 4లో తలపడేవి. 2007లో బౌల్ అవుట్ అనే పద్ధతిపై కొన్ని ప్రశ్నలు తలెత్తినా.. మిగతా టోర్నీ ఫార్మాట్ మొత్తం క్లియర్‌గా ఉండేది. 2021, 2022లో మాత్రం సూపర్ 12 పద్ధతి వచ్చింది. క్వాలిఫయర్స్ మ్యాచ్‌లు ఆడాల్సి వచ్చేది. ఇది కాస్త అయోమయానికి గురి చేసింది. 2024లో తొలిసారి సూపర్ 8లో ఏ టీమ్‌లు ఉంటాయో ప్రిసీడింగ్‌తో నిర్ణయించింది.

--వన్డే ప్రపంచ కప్‌ల్లో ఇలా....తొలిసారి 1975లో వన్డే ప్రపంచ కప్ జరిగింది. 1987 వరకు అంటే నాలుగు ఎడిషన్లకు సంబంధించి షెడ్యూల్ చాలా సింపుల్‌గా ఉంది. ఎనిమిది టీమ్‌లు రెండు గ్రూప్‌లుగా విడిపోయి తలపడ్డాయి. టాప్ 2 జట్లు సెమీస్‌లో ఆడేవి. తర్వాత ఫైనల్. 1992వ సంవత్సరం వరల్డ్ కప్ ముందు వరకు భారత్‌పాకిస్థాన్ ఒక్కసారి కూడా తలపడలేదంటే నమ్మగలమా? ఎందుకంటే ఇరు జట్లూ వేర్వేరు గ్రూపుల్లో ఉండేవి. 92 వరల్డ్ కప్‌లోనే మొదటిసారి ఢీకొట్టుకున్నాయి. అదీనూ రౌండ్ రాబిన్ కావడంతో సాధ్యపడింది. ఐసీసీ ప్రపంచ కప్‌ల్లో 1996 ఎడిషన్ నుంచి పెను మార్పులు సంభవించాయి. 12 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా చేసి.. క్వార్టర్ ఫైనల్స్, సెమీస్‌లు, ఫైనల్ మ్యాచ్ నిర్వహించడం జరిగింది. 1999లో సూపర్ 6 అనే పద్ధతిని ఐసీసీ ప్రవేశపెట్టింది. రెండు గ్రూప్‌లుగా 12 టీమ్‌లు తలపడతాయి. మూడేసి టీమ్‌లు మళ్లీ సూపర్ 6 మ్యాచుల్లో ఆడాయి. 2003లోనూ ఐసీసీ ఇదే పద్ధతిని కొనసాగించింది. ఈసారి 14 టీమ్‌లు రంగంలోకి దిగాయి. టాప్ టీమ్‌లు ఇంటిముఖం పట్టగా.. అనూహ్యంగా కెన్యా సెమీస్‌కు చేరుకుంది. ఆ జట్టు రావడంపై ఇప్పటికీ అభిమానులకు కన్‌ఫ్యూజే. 2007లో 16 జట్లతో సూపర్ 8 పద్ధతిలో మ్యాచులు జరిగాయి. 2011, 2015 వన్డే ప్రపంచ కప్‌లను చూస్తే.. ఫార్మాట్‌ను వివరించడం చాలా తేలిక. రెండు గ్రూప్‌లు, క్వార్టర్ ఫైనల్స్, సెమీఫైనళ్లు, ఫైనల్ అంటూ మళ్లీ '96'ను గుర్తు చేస్తుంది. 2019, 2023లో మళ్లీ రౌండ్‌రాబిన్ పద్ధతిని తీసుకొచ్చింది. ప్రతి జట్టూ మిగిలిన ప్రత్యర్థులతో తలపడేది. 2019లో బౌండరీతో విజేతను తేల్చడం మినహా.. మిగతా అంశాల్లో ఐసీసీ ఫుల్ మార్కులు కొట్టేసింది.

## ఒమన్‌పై విజయంతో ఆసీస్ ఇంటికి..



టీ20 ప్రపంచ కప్ 2026లో లీగ్ స్టేజ్ మ్యాచ్‌లు ముగిశాయి. తన ఆఖరి మ్యాచ్‌లో ఒమన్‌ను 9 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చిత్తు చేసింది. సూపర్8కి అర్హత సాధించడంలో విఫలమైన ఆసీస్ చివరికి విజయంతో ఈ టోర్నీ నుంచి నిష్క్రమించింది. పల్లెకెలె వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ నెగ్గి బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఒమన్ 16.2 ఓవర్లలో 104 పరుగులకు ఆలౌటైంది. అనంతరం లక్ష్య ఛేదనలో ఆసీస్ 9.4 ఓవర్లలోనే వికెట్ నష్టానికి 108 పరుగులు చేసి విజయం సాధించింది. కెప్టెన్ మిచెల్ మార్ష్ (64*) హాఫ్ సెంచరీ సాధించగా.. ట్రావిస్ హెడ్ (32), జోష్ ఇంగ్లిస్ (12*) రాణించారు. ఒమన్ బౌలర్ షకీల్ అహ్మద్ ఒక వికెట్ తీశారు.

--జంపాకు నాలుగు వికెట్లు..టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన ఒమన్ ఏ సమయంలోనూ భారీ స్కోరు దిశగా సాగలేదు. వరుసగా వికెట్లను కోల్పోతూ ఇబ్బంది పడింది. వసీమ్ అలీ (32) టాప్ స్కోరర్. జతిందర్ సింగ్ (17), హమ్మద్ మిర్జా (16), కరన్ (12) ఎక్కువ పరుగులు చేయలేకపోయారు. ఆసీస్ బౌలర్ ఆడమ్ జంపా నాలుగు వికెట్లు తీసి ఒమన్‌ను దెబ్బ కొట్టాడు. అతడితోపాటు గ్లెన్ మాక్స్‌వెల్ 2, బార్ట్‌లెట్ 2.. స్టాయినిస్, ఎల్లిస్ చెరో వికెట్ తీశారు.

## 'నఖ్వీ' జిత్తులకు మేం చిత్తయ్యాం
## ..బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ

పాకిస్థాన్ క్రికెట్ బోర్డ్ (PCB) ఛైర్మన్ నఖ్వీ మాయమాటలకు బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ (BCB) చీఫ్ అమీనుల్ ఇస్లామ్ ప్రభావితమయ్యారని బీసీబీ మాజీ జనరల్ సెక్రటరీ సయ్యద్ అస్రాఫుల్ హక్ సంచలన ఆరోపణలు చేశాడు. దీంతో బంగ్లాదేశ్ టీ20 వరల్డ్ కప్ 2026కు దూరమైందని ఆవేదన వ్యక్తంచేశాడు. 'ఒక క్రికెట్ అడ్మినిస్ట్రేటర్‌గా నేను నిబద్ధత, నిజాయతీని విశ్వసిస్తాను. అమీనుల్ ఇస్లామ్ అమాయకుడు. అతడు నఖ్వీ వలలో పడ్డాడు. నఖ్వీనే అమీనుల్‌ను ఈ విషయంలో బలవంతం చేశాడు. కానీ అతడి మాటలు విని ఏం సాధించాం?' అని సయ్యద్ అస్రాఫుల్ హక్ అన్నాడు. 'ఆ సమయంలో.. మా ప్రభుత్వం భారత్‌కు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంది. అయితే అందుకు సరైన కారణాలు లేవు. అలాగే.. బంగ్లాదేశ్‌కు భారత క్రికెట్ నిర్వాహకుల మద్దతు అవసరం. జగ్‌మోహన్ దాల్మియా కాలంలో మాకు గౌరవం, గుర్తింపు ఉండేది. ఇప్పుడు మా ప్రభుత్వ చర్యల కారణంగా మేం నవ్వుల పాలయ్యాం' అని సయ్యద్ విశ్లేషించాడు. భారత్‌లో తమ జట్టుకు భద్రతాపరమైన సమస్యలను సాకుగా చూపి, తమ మ్యాచులను శ్రీలంకలో నిర్వహించాలని ఐసీసీని (ICC) బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ కోరిన విషయం తెలిసిందే. అయితే భారతదేశంలో భద్రత ప్రమాణాలకు ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ఐసీసీ అందుకు అంగీకరించలేదు. దీంతో బంగ్లాదేశ్ టీ20 ప్రపంచకప్ నుంచి వైదొలిగింది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్‌కు ఐసీసీ అవకాశం కల్పించింది.

# సఫారీలపై భారత్‌దే లీడ్.. ఇవిగో గణాంకాలు!

**ప్పటి వరకు ఓ లెక్కా.. ఇక నుంచి మరో లెక్క. శనివారం నుంచి టీ20 ప్రపంచ కప్‌లో మజానిచ్చే సూపర్-8 పోరు మొదలుకానుంది. ఆదివారం (ఫిబ్రవరి 22) టీమ్ ఇండియా వంతు. తొలి మ్యాచ్‌లో అహ్మదాబాద్ వేదికగా దక్షిణాఫ్రికాతో తలపడనుంది. గ్రూప్ స్టేజ్‌లో ఇరు జట్లూ అజేయంగా సూపర్-8కి చేరాయి. సఫారీ జట్టుతో పోరు అంటే తేలికైన విషయం కాదు. మరి పొట్టి కప్ టోర్నీల్లో ఎవరు హైలైట్‌గా నిలిచారు? ఎవరిది ఆధిపత్యమో ఓ లుక్కేద్దాం..**



--ఎలా ఉన్నాయంటే?.....భారత్ దక్షిణాఫ్రికా ఇప్పటి వరకు ఐసీసీ టీ20 ప్రపంచ కప్‌ల్లో ఏడు మ్యాచులు జరిగాయి. ఐదింటిలో టీమ్‌ఇండియా గెలిచింది. దక్షిణాఫ్రికాపై అత్యధికంగా 2010లో భారత్ 186/5 స్కోరు చేసింది. అత్యల్పంగా 2007లో సఫారీ జట్టును 116/9 స్కోరుకే పరిమితం చేసింది. పరుగులపరంగా సఫారీ జట్టుపై టీమ్‌ఇండియాకు 2007లో విజయం దక్కింది. ఆ మ్యాచ్‌లో 37 పరుగుల తేడాతో భారత్ గెలిచింది. వికెట్లపరంగా.. 2014లో 173 పరుగుల టార్గెట్‌ను ఆరు వికెట్లు ఉండగానే ఛేదించింది. 2012లో ఒక్క పరుగు తేడాతో దక్షిణాఫ్రికాను భారత్ ఓడించింది. ఇదే అత్యల్ప తేడాతో గెలిచిన మ్యాచ్ కావడం గమనార్హం. దక్షిణాఫ్రికాపై ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్ సురేశ్ రైనా. నాలుగు మ్యాచుల్లో 170 పరుగులు చేశాడు. అందులో ఒక సెంచరీ కూడా ఉంది. 60 బంతుల్లో 101 పరుగులు రాబట్టాడు. సఫారీ జట్టుపై అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే. భారత్ దక్షిణాఫ్రికా జట్ల ప్లేయర్లలో ఎక్కువ సగటుతో పరుగులు చేసిన బ్యాటర్ మాత్రం డేవిడ్ మిల్లర్. మూడు మ్యాచుల్లో 103 సగటుతో ఆడాడు. సెంచరీని సురేశ్ రైనా మాత్రమే చేయగా.. విరాట్ కోహ్లి, ఫాఫ్ డుప్లెసిస్ చెరో రెండేసి హాఫ్ సెంచరీలు రాబట్టారు. అత్యధిక సిక్స్‌లు కొట్టిన బ్యాటర్‌గానూ రైనా (6) నిలిచాడు. ఇరు జట్ల మధ్య పోరులో ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్లు ఆర్పీ సింగ్, రవిచంద్రన్ అశ్విన్. వీరిద్దరూ ఐదేసి వికెట్లు చొప్పున పడగొట్టారు. ఆర్పీ సింగ్ (4/13)దే బెస్ట్ బౌలింగ్. 2007లో నమోదు చేశాడు. ఎక్కువ మ్యాచులకు నాయకత్వం వహించిన ప్లేయర్ ఎంఎస్ ధోనీ (5). ఎక్కువ విజయాలు నమోదు చేసిన సారథీ అతడే.. దక్షిణాఫ్రికాతో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్ మాత్రం రోహిత్ శర్మ (6). గత టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌లో ఇరు జట్లూ తలపడగా.. టీమ్‌ఇండియాదే విజయం. దక్షిణాఫ్రికాను ఓడించి రోహిత్ శర్మ నాయకత్వంలో భారత్ టైటిల్‌ను సొంతం చేసుకుంది.

## ఆ ముగ్గురే ఇక నుంచి భారత్‌కు అత్యంత కీలకం: బంగర్



టీ20 ప్రపంచ కప్ 2026లో భారత్ నాలుగు మ్యాచుల్లో వరుసగా విజయం సాధించి సూపర్ 8లో అడుగు పెట్టింది. అభిషేక్ శర్మ మినహా.. టాప్ ఆర్డర్ రాణిస్తోంది. బౌలింగ్‌లో ప్రతి ఒక్కరూ తమ పాత్రను అద్భుతంగా పోషించారు. ఇక నుంచి అసలైన సవాళ్లు టీమ్‌ఇండియాకు ఎదురుకానున్నాయి. సూపర్ 8లో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లతోపాటు సంచలన ప్రదర్శన చేస్తోన్న జింబాబ్వేతో భారత్ తలపడనుంది. ఈ క్రమంలో టీమ్‌ఇండియా తరఫున రాబోయే మ్యాచుల్లో కీలక పాత్ర పోషించే ప్లేయర్లపై మాజీ కోచ్ సంజయ్ బంగర్ తన విశ్లేషణను వెల్లడించాడు. ''ప్రత్యర్థులను మరీ ఎక్కువగా బుల్డోజ్ చేయనక్కర్లేదు. వారిని ఒక జట్టుగా చూడాలి. ఇప్పుడున్న జట్టులో ఒకరిద్దరు మినహా మిగతా ప్లేయర్లంతా మంచి ఫామ్‌లోనే ఉన్నారు. ఇప్పటికీ మన ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ గేమ్ ఇంకా రాలేదు. అయినా సరే విజయాలు వరించాయి. గత నాలుగు మ్యాచుల్లోనూ జట్టులోని ప్రతి ఒక్కరికీ ఆడే అవకాశం దక్కడం కూడా శుభపరిణామం. దీంతో అందరికీ మెగా టోర్నీలో ఆడిన అనుభవం వచ్చింది. అయితే, ఒకే ఒక్క విభాగం ఇంకాస్త మెరుగు కావాల్సిన అవసరం ఉంది. అదే ఫీల్డింగ్. పాకిస్థాన్, నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌ల్లో కొన్ని క్యాచ్‌లను వదిలేయడం చూశాం'' అని బంగర్ వెల్లడించారు.

**--అతడే భారత నంబర్ వన్..**..''టీ20 ప్రపంచ కప్‌లో భారత్ సూపర్ 8లో మూడు మ్యాచులను ఆడనుంది. ఇందులో ముగ్గురు టీమ్‌ఇండియా క్రికెటర్లు అత్యంత కీలక పాత్ర పోషించనున్నారు. ఓపెనర్ ఇషాన్ కిషన్ అద్భుతంగా ఆడేస్తున్నాడు. అభిషేక్ శర్మను బ్యాటింగ్ వైఫల్యాన్ని బాగా కవర్ చేస్తున్నాడు. నా దృష్టిలో ఇషానే భారత నంబర్ వన్ బ్యాటర్. ఇక కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ చాలా నిలకడగా పరుగులు రాబట్టాడు. మున్ముందూ ఇదే ఆటతీరు ప్రదర్శిస్తే చాలు. మూడో ప్లేయర్‌గా జస్‌ప్రీత్ బుమ్రా ముఖ్య భూమిక పోషిస్తాడు. స్పిన్ గురించే ఎక్కువగా చర్చ జరుగుతున్నప్పటికీ.. సూపర్ 8లో బుమ్రా తన పేస్‌తో ప్రత్యర్థులను దెబ్బతీయబోతున్నాడు'' అని బంగర్ తన విశ్లేషణలో పేర్కొన్నాడు.

## 3 మ్యాచుల్లో 175 రన్స్..
# జింబాబ్వే బ్యాటర్ అరుదైన ఘనత



టీ20 ప్రపంచ కప్‌లో ఎక్కువగా పాథున్ నిశాంక, సాహిబ్జాద ఫర్హాన్, ఇషాన్ కిషన్ పేర్లు వినిపిస్తున్నాయి. వీరిలో తొలి ఇద్దరూ ఈ టోర్నీలో సెంచరీలు బాదిన బ్యాటర్లు. ఇక ఇషాన్ గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. టీమ్‌ఇండియా విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. అయితే, మరొక బ్యాటర్ ఉన్నాడు. అతడు ఆడిన మూడు మ్యాచుల్లో రెండు అర్ధశతకాలు సాధించాడు. మరోసారి 48 పరుగుల వద్ద ఆగిపోయాడు. అంటే ఆపాటికే మ్యాచ్ ముగిసింది. మూడు మ్యాచుల్లో ఒక్కసారి కూడా ఔట్ కాని ఏకైక ఓపెనర్. అతడే జింబాబ్వే విజయాల్లో కీలక భూమిక పోషించిన బ్రియాన్ బెనెట్.

---సంచలన విజయాల్లో కీలక పాత్ర....ఇప్పటివరకు ఈ ప్రపంచ కప్‌లో ఓ అరుదైన ఘనతను బెనెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. మూడు మ్యాచుల్లో కలిపి 175 పరుగులు చేసిన బెనెట్.. అత్యధిక పరుగుల జాబితాలో ఆరో స్థానంలో ఉన్నాడు. ఆసీస్, శ్రీలంకపై అర్ధశతకాలు సాధించాడు. ఒక్కసారి కూడా అతడు ఔటై పెవిలియన్‌కు చేరలేదు. ఇలా ఔట్ కానివారి జాబితాలో దక్షిణాఫ్రికా ఆటగాడు డేవిడ్ మిల్లర్ కూడా ఉన్నప్పటికీ.. అతడు ఓపెనర్ కాదు. అందుకే, మరే ఇతర జట్లలోని ఓపెనర్లలో కూడా కనీసం ఒక్కసారైనా పెవిలియన్‌కు చేరకుండా ఎవరూ లేరు.

--భారత్‌తో మ్యాచ్..... సూపర్ 8లో భారత్‌తోనూ జింబాబ్వే ఫిబ్రవరి 26న తలపడనుంది. భారత బౌలర్లు కచ్చితంగా దృష్టిపెట్టాల్సిన బ్యాటర్ బెనెట్. అతడిని త్వరగా ఔట్ చేస్తే.. ఆటోమేటిక్‌గా జింబాబ్వేపై ఒత్తిడి పెంచడం ఖాయం. మరో ఓపెనర్ మరుమాని కూడా ప్రమాదకరమే. ఇక కెప్టెన్ సికందర్ రజా కూడా మంచి స్ట్రైక్‌రేట్‌తో పరుగులు రాబడుతున్నాడు. ఈ ముగ్గురిని కట్టడి చేస్తే చాలు అని క్రికెట్ విశ్లేషకులు సూచించారు.

## సెమీస్‌కు వెళ్లే 4 జట్లు..
## భారత టాప్ ప్లేయర్ల అంచనాలివే!



**టీ20 ప్రపంచ కప్‌లో సూపర్ - 8 దశ మొదలుకానుంది. ఇప్పటికే ఎనిమిది జట్లు నాలుగేసి చొప్పున రెండు గ్రూప్‌లుగా విడిపోయాయి. భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఒక గ్రూప్ కాగా.. న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంక, పాకిస్థాన్ మరో గ్రూప్‌లో ఉన్నాయి. ప్రతి టీమ్ మూడు మ్యాచులు ఆడనుంది. టాప్-2లో నిలిచే టీమ్‌లు సెమీస్‌కు చేరతాయి. ఈ క్రమంలో సెమీఫైనల్‌లో అడుగుపెట్టే జట్లేవో భారత క్రికెటర్లు అంచనా వేశారు. మరి మీ 'నాలుగు' టీమ్‌లను కూడా ఎంపిక చేసుకోండి. కింది పోల్‌లో మీ అభిప్రాయాన్ని తెలియజేయండి.**